వేదాంతభేరి

అక్టోబర్ 2021 రూ. 10/-

వేదాంతభేరి

అక్టోబర్ 2021 రూ.10/-

తిరుక్కురల్

జీవితంలో దేనినీ కాపాడుకోకపోయిననూ పరవాలేదు. నాలుకను జాగ్రత్తగా ఉంచుకోననిచో తన మాటలే తన శత్రువులై దు:ఖానికి, నష్టానికి దారితీస్తాయి.

రైతులు బలహీనులైనచో ఎంతటి గొప్ప స్థాయిలో ఉన్నరాష్ట్రమైన పతనము కాక తప్పదు.

భూమి తనను తవ్వినవారిపట్ల కోపగించుకోదు. అలాగే మనలను నిందించేవారిని మనం క్షమించాలి. అదే ఉత్తమోత్తమ ధర్మము.

క్రమశిక్షణ జీవితంలో ఎంతో ముఖ్యము. క్రమశిక్షణ గల జీవితము వలన విలువ పెంపొందుతుంది. కాబట్టి క్రమశిక్షణ అన్నది జీవితంకంటే చాలా అమూల్యమైనదని గుర్తించాలి.

తన ప్రవర్తనను తాను స్వయంగా నియంత్రణ చేసుకొని సక్రమంగా జీవించలేకపోతే తన చదువంతా వ్యర్థమే. నియమబద్ధంగా జీవించడం సమాజంలో అందరి సహకారం లభించడం అన్నవి వేదవేదాంగాల పఠన కన్నా ముఖ్యము.

తన నీడ కన్ను వెంటాడునట్లు తాను చేసే చెడుకార్యాల దుష్ఫలితం తన్ను వెంటాడుతూనే ఉంటుంది.

నీ చుట్టుప్రక్కల ఉన్నవారికి ఉపయోగకారిగా ఉండడం వలన కలిగే సంతోషానికి మించినది మరొకటి లేదు. ఈ అరుదైన అవకాశాన్ని వదలుకోకండి.

మనిషి సాంఘిక ప్రాణిగా జన్మించాడు. ఎవరైతే సమాజానికి సహకరిస్తూ జీవిస్తాడో వాడే నిజంగా జీవించినట్లు. ఈ ధర్మాన్ని ఎవడు గుర్తించడో అటువంటి వ్యక్తి మరణించినవాడుగానే లెక్క

అసూయ, అత్యాశ, కోపం, పరుషమైనమాట ఈ నాలుగింటిని వదలిపెట్టినవాడెవడో వాడే సజ్జనుడు.

-- తిరువళ్ళువర్ నైనార్

ॐ వేదాంతభేరి ॐ

సంస్థాపకులు శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

సంపుటము : 54 | అక్టోబర్ 2021 | సంచిక : 10

సంపాదకులు

శ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారు

సంపాదక మండలి

శ్రీ సంపూర్ణానందగిరి స్వాములవారు

శ్రీవిజయానంద బ్రహ్మచారి

కె.ఈశ్వర్

డాక్టర్ సముద్రాల లక్ష్మణయ్య,శిరోమణి, ఎం.ఎ.,

డాక్టర్ కె.సర్వోత్తమరావు,ఎం.ఎ., పి.హెచ్.డి.,

శాశ్వత పోషక చందా రూ. 2000/- అంతకుమించి

సంవత్సర చందా రూ. 100/-లు , విడి సంచిక రూ. 10/-లు

విదేశాలకు సంవత్సర చందా (ఎయిర్ మెయిలు) 20 డాలర్లు

చందా పంపవలసిన అడ్రసు : శ్రీ శుకబ్రహ్మాశ్రమము,
స్వామి విద్యాప్రకాశానంద నగర్,
శ్రీ శుకబ్రహ్మాశ్రమము (పోస్టు)
శ్రీకాళహస్తి, పిన్ - 517640
ఫోన్ : 08578- 222239

చందాదారులు ఉత్తర ప్రత్యుత్తరాలలో తమ చందా నెంబరు తప్పక వ్రాయవలెను.

Printed & Published by Sri Vidyaswarupanandagiri swami on behalf of Sri Sukabrahma Ashramam and Printed by B.Viswanadham at C.N. Printer, TIRUPATI, Andhra Pradesh; Published at Sri Sukabramhasramam, Swami Vidyaprakashananda Nagar, Sri Sukabramhasramam Post, Srikalahasti-517 640, Chittoor Dist., Andhra Pradesh.
Editor : SRI VIDYASWARUPANANDA GIRI SWAMI

ॐ వేదాంతభేరి ॐ

అనుష్ఠాన వేదాన్తాన్ని బోధించు మాసపత్రిక

సంపుటము : 54 | అక్టోబర్ 2021 | సంచిక : 08

విషయసూచిక

1. ప్రార్థన 5
2. లాలయేత్ చిత్తబాలకమ్ - శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు 6
3. సద్గురువాణి - శ్రీమలయాళ స్వాములవారు 10
4. శ్రీమనీషా పంచకం - శ్రీ సంపూర్ణానందగిరి స్వాములవారు 12
5. పరీక్షాకేంద్రము - - శ్రీ సర్వాత్మానందగిరి స్వాములవారు 17
6. పరమహంస ప్రసాదము - శ్రీరామకృష్ణ పరమహంస 21
7. ఆత్మవిశ్వాసం - డా॥ సముద్రాల లక్ష్మణయ్య 22
8. శ్రీసరస్వతీ స్తోత్రము - - శ్రీ అఖణ్డానన్దగిరి స్వాములవారు 27
9. మంగళం - శుభమంగళమ్ - ఆచార్య కె.సర్వోత్తమరావు 28
10. హరన్త్యఘం తేఽజ్ఞసజ్గాత్ - శ్రీవిద్యాప్రకాశానందగిరి స్వాములవారు 32
11. ముణ్డకోపనిషత్ 35
12. శ్రీమదాంధ్రభాగవతం - తృతీయస్కంధం
- వచనానువాదం - ఆచార్య జక్కంపూడి మునిరత్నం 36
12. పరశురామావతార దీప్తి - ఆర్. శోభాదేవి 39
13. వార్తలు 42

ముఖచిత్రం : అన్నపూర్ణాదేవి

02-10-2021తేది గాంధీజయన్తి

12-10-2021తేది సరస్వతి పూజ

13-10-2021తేది దుర్గాష్టమి, దుర్గాపూజ

14-01-2021తేది మహార్నవమి, లక్ష్మీపూజ

ఇందులోని వ్యాసముల భావములకు వ్యాస రచయితలే బాధ్యులు

ప్రార్థన

అన్నపూర్ణా స్తోత్రమ్

1. ఓం నిత్యానన్దకరీ వరాభయకరీ సౌందర్య రత్నాకరీ
నిర్ధూతాఖిలఘోరపావనకరీ ప్రత్యక్షమాహేశ్వరీ ।
ప్రాలేయాచల వంశ పావనకరీ కాశీపురాధీశ్వరీ
భిక్షాం దేహి కృపావలంబనకరీ మాతాన్నపూర్ణేశ్వరీ ॥

2. నానారత్న విచిత్ర భూషణకరీ హేమాంబరాడంబరీ
ముక్తాహార విడంబమాన విలసద్వక్షోజ కుంభాన్తరీ ।
కాశ్మీరాగరు వాసితాంగ రుచిరే కాశీపురాధీశ్వరీ
భిక్షాం దేహి కృపావలంబనకరీ మాతాన్నపూర్ణేశ్వరీ ॥

3. యోగానందకరీ రిపుక్షయకరీ ధర్మైకనిష్ఠాకరీ
చంద్రార్కానల భాసమాన లహరీ త్రైలోక్యరక్షాకరీ ।
సర్వైశ్వర్యకరీ తపఃఫలకరీ కాశీపురాధీశ్వరీ
భిక్షాం దేహి కృపావలంబనకరీ మాతాన్నపూర్ణేశ్వరీ ॥

4. కైలాసాచల కందరాలయకరీ గౌరీహ్యుమాశాంకరీ
కౌమారీ నిగమార్థగోచరకరీ ఓంకార బీజాక్షరీ ।
మోక్షద్వార కవాట పాటనకరీ కాశీపురాధీశ్వరీ
భిక్షాం దేహి కృపావలంబనకరీ మాతాన్నపూర్ణేశ్వరీ ॥

5. దృశ్యాదృశ్య విభూతి పావనకరీ బ్రహ్మాండ భాండోదరీ
లీలానాటకసూత్ర ఖేలనకరీ విజ్ఞానదీపాంకురీ ।
శ్రీవిశ్వేశమనఃప్రమోదనకరీ కాశీపురాధీశ్వరీ
భిక్షాందేహి కృపావలంబనకరీ మాతాన్నపూర్ణేశ్వరీ ॥

లాలయేత్ చిత్తబాలకమ్

- శ్రీ విద్యాప్రకానందగిరి స్వాములవారు

సాధకుడు చాల యెత్తుగాను, చాల పల్లము గాను లేనట్టి స్థానమున (అనగా ఒకింత ఎత్తుగానున్న చిన్న పీట మొదలగువానిపై) దర్భాసనము పఱచుకొని, దానిపై జింక చర్మమును కాని, పులి చర్మముకాని వేసి కొని, దానిపై గుడ్డపఱచి ఈ ప్రకారముగ మెత్తగ, కదలకయుండు చోటుపై తనకు అనుకూలమైన ఆసనము వైచికొని కూర్చుండి ధ్యానము ప్రారంభింపవలెను.

స్థిర సుఖ మాసనమ్ - అని పతంజలి నుడివినట్లు ఏ ఆసనము వవేసికొనిన తాను కదలక నుండగలడో, ఏది తనకు అనుకూలముగ నుండునో దానినే ధ్యాన కాలమున సాధకుడు అవలంబించవచ్చును. అయితే కూర్చొనునపుడు శరీరము, శిరస్సు ఏమాత్రము వంగకుండా నిటారు (Perpendicular) గ నుండవలెను. ఏలయనిన బొడ్డు క్రింద మూలాధారమున నిద్రించుచు నుండు కుండలినీశక్తి తీవ్రధ్యానముయొక్క ప్రభావముచే లేచి ఊర్ధ్వ ముఖముగ ప్రవహింపజొచ్చును. మూలాధారమునుండి బయలుదేరి స్వాధిష్ఠాన, మణిపూరక, అనాహత, విశుద్ధ, ఆగ్నేయ, సహస్రారములను షట్చక్రములగుండ ప్రవహించును. అత్తఱి శరీరాద్యవయవములు తిన్నగ నున్నచో ప్రవాహము నిరాటంకముగ జనును. వంకరగనున్నచో కొంత ప్రతిబంధము కలుగవచ్చును.

కనుకనే శ్రీకృష్ణపరమాత్మ ‘ సమం కాయశిరోగ్రీవం’ అని పేర్కొనెను. ఈ ప్రకారముగ కూర్చుండి, దృష్టిని ముక్కుచివఱ (నాసికాగ్రమునందు) ఉంచి దిక్కులను చూడకుండ మనస్సును ఏకాగ్ర

పఱచి పరమాత్మచింతనమును ప్రారంభించవలెను. గీతయందు నాసికాగ్రదృష్టి చెప్పబడినది.

కొందఱు భ్రూమధ్యమందు దృష్టిని నిలిపి ధ్యానింతురు. మఱికొందరు హృదయస్థానమందు నిలుపుదురు. వేఱొకరు సహస్రారమందు నిలుపుదురు. వారి వారి అనుకూలములనుబట్టి ఏదియో యొకచోట స్థిరపఱచుకొని అచ్చోటు దృష్టినుంచి మనస్సును దృశ్య విషయములపై చెదరనీయక ఏకాగ్రముగ దైవధ్యానము సలుపవలెను.

కాని కొందఱికి ప్రారంభములో మనస్సు ధ్యేయవస్తువగు పరమాత్మయందు నిలుకడను బొందక పూర్వవాసనాబలముచే బయటకు పరుగెత్తుచుండును. వారికి ధ్యానముచేయవలెనను కుతూహలము ఉండును గాని మనస్సు చంచలముగా నున్నదై వేధించుచుండును. లక్ష్యమందు నిలువక పారిపోవుచుండును. అపుడు సాధకుడేమి చేయవలెను? దానికి శ్రీ కృష్ణమూర్తి ఇట్లు సమాధానమొసంగెను.

యతో యతో నిశ్చరతి మనశ్చంచల మస్థిరం

తతస్తతో నియమ్యైత దాత్మన్యేవ వశం నయేత్. (గీత 6-26)

‘మనస్సు చంచలముగను, అస్థిరముగను నున్నదై ఏయే విషయములపైకి పరుగెత్తునో, ఆయా విషయములనుండి దానిని మరల్చి, దానికి బుద్ధిచెప్పి, మరల ఆత్మయందే యుంచవలెను’ **‘లాలయేత్ చిత్తబాలకమ్’** అని వసిష్ఠు లానతిచ్చినట్లు చిత్తమను బాలకుని హితవాక్యములచే మెల్లగ లాలించి దారికి తీసికొని రావలెను. అంతేగాని బలత్కారముచేసినచో అయ్యది తిరుగబడును, ప్రతిక్రియ

(Reaction) కలుగజేయును. అట్టి మోటు పద్ధతులను ధ్యాననిష్ఠుడు ఎన్నటికిని అవలంబించగూడదు.

పూర్వము ఉద్దాలకుడు తన ఇంద్రియములకు మనస్సునకు ఎంత నయముగ బోధించి వానిని స్వాధీనపఱచుకొనెనో సాధకులు జ్ఞాపకమునకు తెచ్చుకొనవలెను. సాధకుడీ క్రిందగివిధముగ తన మనస్సున కుద్బోధించవలెను.

ఓ మనస్సా! ఓ ఇంద్రియములారా! మీరెచటికి పరుగెత్తెదరు. విషయములపైకా? చాల పొరపాటు. అయితే అది మీ తప్పుకాదు. అనేకజన్మార్జితములగు ప్రాపంచిక వాసనలవలననే మీకట్టి బుద్ధి కలుగుచున్నది. ఇంతకాలమువఱకు మిమ్ములను ప్రేరేపించిన యాబుద్ధి అవిద్యావృతమై అంధకారమున బడియున్నది.

ఇప్పుడు సద్గురుకటాక్షమున జ్ఞానముదయింప అవిద్య అంతరించిపోవ వస్తువులయొక్క యథార్థతత్త్వము గోచరించినది. మీరింతగ నభిలషించుచున్న యా పదార్థములు సత్యములు కావు. క్షణికపదార్థము ఆనందమునెట్లు కలుగజేయగలదు? నాశశీలమగు వస్తువునుండి నిరతిశయ సుఖమెట్లావిర్భవించగలదు? ఒకవేళ ఆ పదార్థములు రమణీయములుగానున్నవని యందురా! అది ఆపాతరమణీయత్వమే కాని వాస్తవ సౌందర్యముకాదు.

పంచభూతాత్మకములై కాలక్రమమున నశించిపోవునవియు, క్రుళ్లి కృశించిపోవునవియునగు పదార్థములందు ఏలాటి రమణీయత్వము ఉండునో మీరే యోచించుకొనుడు. మోసపోవద్దు. (బంగారు లేడిని చూచి సీత అది సత్యమని భ్రమించి దానిని కాంక్షించినది. ఫలితమేమైనదో మీకు తెలియునుగదా! శ్రీరామచంద్రుని పోగొట్టుకొనినది. ఆత్మారామునకు (సుఖమునకు) దూరమైనది. (శోకమావరించినది.) కావున మీరున్ను ప్రపంచముయొక్క

తళుకులనుజూచి మురిసిపోయి వానివెంట పరుగెత్తితిరా, మోకాలి దెబ్బలుతప్ప మఱేవియు మిగులవు. ఎండమావులనుజూచి చెంబులు తీసికొని పరుగెత్తువారికి ఎన్ని నీళ్లు లభించునో మీకును అన్నియే లభించును. మీ జన్మహక్కగు ఆత్మానందము ననుభవించుటకై సన్నద్ధులు కండు. దానికొఱకై మీరు దూరముగ పరుగిడనవసరము లేదు. అది మీచెంతనేయున్నది. బహిఃప్రవృత్తిని వదలి అంతర్ముఖులుకండు. మీకది కరతలామలకమైపోవును. జన్మ సఫలమగును.

కావున ఓ ఇంద్రియములారా! ఓ మనస్సా! అనేక జన్మలయందు బాధపడినది చాలును. ఇప్పటికైనను బుద్ధి తెచ్చుకొని, చెంపలు వాయించుకొని భగవానుని యాదేశమును పాటించి '**న తేషు రమతే బుధః**' అనునట్లు భోగజాలమందు రమింపకుడు. పదార్థవ్యామోహమును విడనాడుడు. జీవితము అతి స్వల్పమైనది. మృత్యువు శరీరమును కబళించుటకు పూర్వమే మీ లక్ష్యమగు పరమాత్మను జేరుకొనుడు.

'ఉత్తిష్ఠత! జాగ్రత! ప్రాప్యవరాన్ నిబోధత' - లెండు! మేలు కొనుడు! పెద్దల నాశ్రయించి అవిద్యనుండి తెప్పరించుకొనుడు!' అని ఈ ప్రకారముగ ఆ ఇంద్రియమనంబులకు మెల్లగా హితబోధచేసి దృశ్యవిషయములనుండి వానినెట్టైన మరల్చి ఆత్మయందు స్థాపితము చేయవలెను. ఇంత బోధించినప్పటికిని, మనస్సు ఒప్పుకున్నట్లు ఒప్పుకొని, కొంతసేపటికి మరల తటాలున జారిపోవును.

అత్తఱి నిరుత్సాహపడకుండ మరల వెనువెంటనే దానిని లేవనెత్తి తీసికొనివచ్చి అధిష్ఠానమగు ఆత్మయందు, హృదయమందు చేర్చవలెను. ఇంతకుమినహా మనశ్శాంతికి వేఱొక దారిలేదు. ఇట్లు చేయుచు రాగా రాగా, కొంతకాలమునకిక ఆ మనస్సు తన పాత పద్ధతులను మార్చుకొని, పాతదారులను వదలిపెట్టి 'స్వాధీన పడగలదు.

సద్గురువాణి

- శ్రీమలయాళ స్వాములవారు

1. వివేకవంతుడైన ఒకడు తనయొక్క తుచ్ఛములయిన ఇంద్రియాది సౌఖ్యములను విడిచెనేని తనకు శాశ్వత సుఖమగు జ్ఞానము లభించునదేగాక పెక్కు వేలుగ మనుష్యాది ప్రాణులకు ఇహపరసుఖముల నిచ్చుటకు శక్తుఁడగును.

వివేకశూన్యుడైనవాడొక్కడు ఎటువంటివాడైనను తుచ్ఛములైన తన యింద్రియాది సుఖములకొఱకు నోఱు దెరచుకొని నిరీక్షించు చుండెనేని వానికి లోకములోగల అనేక కోట్ల మనుష్యాది ప్రాణులను పీడించి వధించినను చాలదు. దీనిని బాగుగ విచారింపుడు.

2. రాత్రి కాలములో నక్షత్రములు స్పష్టముగా బ్రకాశించుచుండినను, సూర్యుడు ప్రకాశించునప్పుడు మాయమై పోవునట్లు అజ్ఞానదశయందున్నవారికి ఇంద్రియ విషయములైన వృత్తులుండునేగాని ప్రబోధజ్ఞానమను సూర్యుడు ఉదయించునపుడు ఉండవు. ఇదియే జ్ఞానియొక్క గుర్తు.

3. సూర్యునకభిముఖముగా చూపిన సూర్యకాంతి అద్దముద్వారా, సూర్యకిరణము లగ్నియై క్రిందిభాగములలోనున్న వస్తువులను కాల్చివేయునట్లు ఎవరి మనస్సు ఆత్మముఖమై ఏకాగ్రత నొందియుండునో వానియందు గల అజ్ఞానకర్మ స్వరూపకట్టెలన్నియు జ్ఞానాగ్నిచే కాల్పబడును. సూర్యకిరణము ఇతర స్థలములకన్న అధికముగా అద్దములో ప్రవేశించుటలేదు. అద్దములో ప్రతిబింబించిన కిరణములు ఏకీకరించెడు శక్తి అద్దముయొక్క నిర్మాణమందుండుటచే అగ్ని కలుగుటకు కారణమగుచున్నది.

ఆత్మశక్తి అందరి హృదయములో ఒకేవిధముగా నుండినను ఏకాగ్రతయు, విశుద్ధతయుగల హృదయములలో మాత్రమే జ్ఞాన జ్యోతి ప్రజ్వలించుచుండును.

4. చెఱకు, నీలిచెట్టు మొదలైనవి పరిపక్వకాలమును కనిపెట్టి సారమును తీసిన మాత్రముననే వాటిచే కలిగెడు ఫలితమును అనుభవింప కలుగుదుముగదా! కాలముతప్పిన, నిరుపయోగమై పోవునట్లు మనుష్య జన్మమున మంచి యౌవనకాలమందే ఆత్మజ్ఞానపరులై, జ్ఞానమును తెలిసికొనుటకు ప్రయత్నించ వలయును. అట్టి మంచి తరుణము చేతినుండి జారిపోయెనేని, మరల జన్మము నిరర్థకమగును.

5. మొదలు చెడినప్పుడు గొప్ప వృక్షమైనను దాని ఫల, పల్లవ, లతాదులెట్లు ఎండి రాలిపోవునో, తమ నడకలో లోపము కలిగినచో ఎంతటి యోగికైనను జ్ఞాన, విజ్ఞాన, శమ, దమ, సత్య, ధర్మాది దైవగుణములు, కీర్తి, గౌరవ, యశస్సులు కూడ అతనిని విడిచిపోవును.

6. ప్రతిసాధకుడు తన మనోవ్యాపారములను సదా పరిశోధించు చుండవలెను. మలినవృత్తులు తోచిన వెంటనే నిర్మల భావములను భావించవలయును. ఎందుకనగా బురదను శుభ్రమైన నీటిచే కడిగివేయవచ్చును. అటులనే అశుద్ధభావములు మన హృదయములో అంకురించిన క్షణముననే మహాత్ముల రూపములను భావించియు, వారి పవిత్ర భావము స్మరించియు పరిశుద్ధము కావలయును.

వేదాన్తభేరి పాఠకులకు, చందాదారులకు, పోషకులకు **విజయదశమి శుభాకాంక్షలు.** విజయదుర్గ లోకానికి కరోనా ఉపద్రవాన్ని పోగొట్టి శాన్తినిచ్చును గాక!

శ్రీ మనీషా పంచకమ్

- శ్రీ సంపూర్ణానందగిరి స్వాములవారు

కదాచిచ్ఛంకరాచార్యః కాశీం ప్రతియయౌ ।
చండాలరూపిణం దృష్ట్వా గచ్ఛ గచ్ఛేతిచాబ్రవీత్ ॥

శ్రీ జగద్గురు శంకరాచార్యులవారు జీవనకాలంలో ఒకానొకప్పుడు పవిత్రమైన గంగానది తీరములో పరమపవిత్రమైన కాశీక్షేత్రములో నున్న శ్రీ కాశీ విశ్వేశ్వరుని దర్శనార్థము, సకలదేవతలు నివసించే గంగానదిలో స్నానముచేసి విశ్వనాథుల దర్శనమునకై వెళ్లు సమయములో మార్గ మధ్యమున, ఎదురుగా వస్తున్న చండాలునిచూచి "దూరం గచ్ఛ గచ్ఛేతి" దూరముగా పొమ్ము, దూరముగా పొమ్ము యని ఆచార్యులవారు పలికిరి.

చండాల ఉవాచ

అన్నమయాదన్నమయం అథవా చైతన్యమేవ చైతన్యాత్ ।
యతివర దూరీకర్తుం కిం వాంఛసి బ్రూహి గచ్ఛగచ్ఛేతి ॥

ఛండాలుడు చెపుచున్నాడు ఏమనగా! ఆచార్యవర్యా! మీరు దూరముగా పొమ్ము పొమ్ము అని రెండు పర్యాయములు పలికారు కదా! దూరముగ పొమ్మనేది అన్నమయముతో కూడిన శరీరమునా? లేక ఈ జడ శరీరమునకు చేతనత్వం కలుగజేసిన చైతన్యమును దూరముగా పొమ్మంటివా చెప్పుము అనిడిగెను.

శ్రీశంకరులు ఏమియు సమాధానం చెప్పలేదు. ఆ సమయంలో ఛండాలుడే చెప్పెను ఏమనగా! ఆచార్యవర్యా శంకరా! ఒక పక్షమున అన్నమయ శరీరమునే దూరముగా పొమ్మన్నాను అని మీరంటే మీ పవిత్రమైన బ్రాహ్మణ శరీరము, నా అపవిత్రమైన ఛండాల శరీరము

రెండు శరీరములు అన్నమయముతో కూడుకొనినవే కదా! ఆత్మనః అకాశ స్సంభూతః ఆకాశాద్వాయుః వాయోరగ్నిః అగ్నేరాపః అద్భ్యః పృథివీ, పృథివ్యాం ఓషధయః ఓషధేభ్యో అన్నం అన్నాత్ పురుషః సవా ఏష పురుషోఽ న్నరసమయః" ॥ భావమేమనగా - పరమాత్మ నుండి ఆకాశంపుట్టినది. ఆకాశమునుండి వాయువు, వాయువు నుండి అగ్ని. అగ్ని నుండి జలం, జలంనుండి భూమి, భూమి నుండి ఓషధులు (ఓషధులనగా - ధాన్యం, పెసలు, మినుములు, కందులు జీడిపప్పు, కిసిమిస్, ఆవాలు, జీలకర్ర మొదలగునవి. మనం తినే ఆహార వస్తువులను ఓషదులు అంటారు. పృథివీ నుండి ప్రాణివర్గమునకు జీవనహేతువులు అయిన ఓషధులు = వ్రీహ్యాదులు పుట్టినవి.) ఈ ఓషదులనుండి అన్నం అని మూలంలో చెప్పారు. అద - భక్షణే ధాతువునుండి అత్తీతి అన్నం. అత్తి అనగా తినుట భుజించుట. జీవనార్థం తినే వస్తులను అన్నం అందురు. "అన్నాత్ పురుషః" అన్నారు. అన్నం వలన శుక్ల శోణితములుత్పన్నమై కరచరణాది అవయములతో గూడిన శరీరముత్పన్న మగుచున్నది.

ఏ శరీరమైన శుక్ల శోణితములచే పుట్టినదే గదా! పుట్టిన ప్రతి శరీరమునకు అస్తి, జాయతే, వర్ధతే, పరిణమతే, అపక్షీయతే, వినశ్యతి అనే ఈ షడ్భావ వికారములు సహజమే కదా. ఈ వికారములు చండాలునకే ఉంటాయి, బ్రాహ్మణునికి ఉండవు అనే నియమము లేదు కదా. నెయ్యి, జీడిపప్పు, బాదము మరియు పంచభక్ష్య పరమాన్నములతో తినిన శరీరములో, గంజి అన్నం, రాగి జావ భుజించిన శరీరంలో గాని వున్న ఎముకలు, చర్మము - రక్తము - మాంసం స్నాయువులు, శుక్రశోణితములు ఉత్పన్నమొకటేకదా! వీటిలో మార్పేమి లేదు. ఏ శరీరమైన పంచీకృత పంచమహాభూతాలైన 1.ఆకాశం, 2. వాయువు, 3. అగ్ని, 4. జలం, 5. పృథ్వీ వీటి

ఆధారముతో ఉత్పన్నమయి, వీటితోనే శరీరానికి జీవనాధారము. కాబట్టి మీ శరీరమునకు నా శరీరమునకు భేదమే మున్నదని దూరముగా పొమ్మనిరి. అని ఛండాలుడు పలికెను. ఆచార్యులవారు ఏ సమాధానము చెప్పక మౌనముగా నుండిరి.

మీరు మౌనముగా నుండుటకు కారణమిది అని నేనూహిస్తున్నాను. ఏమనగా - శరీరమును దూరముగా పొమ్మన లేదు, ఆత్మను - చైతన్యమును దూరముగా పొమ్మనుచున్నాను అని యనుకొనుచున్నారా! చైతన్యమును పొమ్మనడంకూడా సమన్వయం కాదు. అదెట్లనగా -

మీలోనున్న చైతన్యం, నాలోనున్న చైతన్యం, ఈ కాశి పురజనులలో నున్న చైతన్యం మానవులైన స్త్రీ పురుషులందరిలోనున్న చైతన్యం, బ్రహ్మాది దేవతలందరిలోనున్న చైతన్యము, పశు పక్ష్యాదు లన్నిటిలో నున్న చైతన్యము ఒక్కటే. స్థావరజంగమాత్మకమైన సమస్త ప్రపంచములో వ్యాపకమైన చైతన్యం ఒక్కటే అయినపుడు చైతన్యమునకు దూరముగా పొమ్మనుట తగదు. అంతటా నిండబడిన చైతన్యమునకు స్వభావముగా రాకపోకలు లేవు. ఈ విషయంలో మరియు వినండి అని చండాలుడు చెప్పుచున్నాడు.

"ప్రత్యగ్వస్తునినిస్తరంగ సహజానందావబోధాంబుధౌ ।
విప్రోఽయం శ్వపచోఽయ మిత్యపి మహాన్ కోఽయం విభేదభ్రమః॥

శరీరం, ఇంద్రియములగు చక్షు, శ్రోత్రత్వక్ జిహ్వా, ఘ్రాణములగు జ్ఞానేంద్రియములకంటెను, వాక్, పాణి పాద పాయు ఉపస్థేంద్రియములగు కర్మేంద్రియములకంటెను, మనోబుద్ధి చిత్త అహంకార రూపమగు అంతఃకరణముకంటెను, ప్రత్యక్ = వేరైన చైతన్యమును, మరియు నిస్తరంగ = ఆధ్యాత్మిక, ఆధిభౌతిక,

ఆధిదైవికములగు దుఃఖములకు అంటనిదియు, ఉపద్రవ రహితమైన చైతన్యమును, స్వభావముగా ఆనందస్వరూపమైన చైతన్యమును బాగుగా తెలిసికొని ఆనంద సముద్రములో నిమగ్నమైన వారికి ఇతడు బ్రాహ్మణుడు, ఇతడు ఛండాలుడు అనే గొప్పదైన ఈభేద భ్రమ ఎలా కల్గుతుంది? ఈ భేద భ్రమ ఉండకూడదని భావము.

చండాలుడు లోకదృష్టాంతరూపములో శ్రీ ఆచార్యులవారికి చెప్పుచున్నాడు. ఏమనగా -

"కిం గంగాంబుని బింబితేఽంబరమణౌ చండాలవీథీపయః ।
పూరేవాంతరమస్తి కాంచనఘటీమృత్ కుంభయోర్వాఽంబరే॥

ఆచార్యవర్యా ! ఈ పవిత్రమైన కాశీక్షేత్రములో ప్రవహించు చున్న పవిత్రమైన గంగానదిలో లోకమంతటికి కాంతిని ప్రసాదించిన సూర్యుని ప్రతిబింబము పడుచున్నది. ఈ విధముగానే చండాల వీథిలో మురికి నీటిలో గూడా సూర్య ప్రతిబింబము పడుచున్నది. ఈ గంగా పవిత్రతగాని, మురికినీటి అపవిత్రతగాని ప్రతిబింబమునకు, బింబమునకు రెంటికిని అంటడంలేదు. ఆ విధంగా వేద వేదాంగములు బాగుగా అధ్యయనము చేసిన మీ శరీర పవిత్రతగాని, ఏమీ చదవని ఆచరణ లేని అపవిత్రమైన నా శరీర అపవిత్రతగాని మన ఇద్దరిలోనున్న చైతన్యమును అంటదు. మరి యొక ఉదాహరణ చెప్పుచున్నాడు. బంగారు కుండ నిండా ఉన్న నీటిలో, మట్టి కుండనిండా యున్న నీటిలో పడిన సూర్యప్రతిబింబమునకు బంగారు గాని, మట్టిగాని అంటదు. మరియు బంగారు కుండలో ఆకాశముంటుంది, మట్టి కుండలోనాకాశముంటుంది. ఆకాశము మట్టిని గాని బంగారమును గాని ఏ విధముగా నంటదో, అట్లే చైతన్యము గూడా చరాచర ప్రపంచమంతా వ్యాపించి దేనిని అంటదు అని చెప్పెను.

శ్రీ ఆచార్యులవారు చండాలుడు చెప్పిన అఖండమైన ఆత్మ బోధను విని, నాలోయున్న అజ్ఞానమును పోగొట్టడానికై వచ్చిన మహాజ్ఞాని యని మనస్సులో భావించెను. సత్వగుణాధిక్యముగలవారు, ఆత్మ విచారణపరులయినవారు, ఎదుటివారు ఎవరైనా సరే, వారి మాటలను విని అర్థం చేసుకొని తన దోషములను తెలుసుకొని వెంటనే మార్పు చెందుదురు. అజ్ఞానులు, అహంకారపరులై, శరీరాభిమానము గలవారై, పాండిత్యబలంచే, జనబలంచే, శిష్యబలంచే మంచి చెప్పినవారినే ద్వేషించి, అవమానపరచి శిక్షించెదరు. సాధకులు, సదాచార సంపన్నులు గమనించదగిన ముఖ్యవిషయమిది.

శ్రీ శంకరాచార్యులవారు వెంటనే మార్పుచెంది తనకు గల్గిన భావమును చండాలుని సన్నిధిలోనే విన్నవించుకొనుచున్నారు. మరియు ఆభావములను వారి ఎదుట చెప్పి చండాలునికి సాష్టాంగ నమస్కారములు చేసిరి. 5 శ్లోకములలో ఈ భావములున్నవి. వీటినే మనీషా పంచకమందురు. (సశేషం)

వేదాన్తభేరికి ఈ క్రిందివారు పోషక చందా పంపినారు

1. జె.నాగేశ్వరరావు (మేడ్చెల్) రూ. 2000/-
2. నాగేశ్వరరావు పోతురెడ్డి (పేరవరం, తూ.గో.జిల్లా) రూ. 2000/-
3. డా॥ ఎ.రవిశంకర్ రెడ్డి (కర్నూలు) రూ. 2000/-
4. శ్రీఅఖణ్డానంద స్వాములవారు రూ. 2000/-
(శ్రీప్రణవసద్గురు సేవాసంఘము, వెంగాపురం)

వేదాన్తభేరి మూలనిధికి ఈ క్రింది వారు పైకం పంపినారు

1. జి.మూర్తి (ముంబయి) రూ. 2000/-
2. డా॥ ఓ.రవిశంకర్ రెడ్డి (కర్నూలు), రూ. 2116/-

త్రినేత్ర వైద్యాయ ట్రస్టుకు ఈక్రింది వారు విరాళం పంపినారు.

బి.ఎన్.విజయభాస్కర్ (శ్రీశుకబ్రహ్మాశ్రమం, శ్రీకాళహస్తి) రూ. 10116/-

పరీక్షా కేంద్రము

- శ్రీ సర్వాత్మానందగిరి స్వాములవారు

"మనఏవ మనుష్యాణాం కారణం బంధమోక్షయోః ..." అంటే జీవియొక్క బంధానికీ మోక్షానికీ మనసే కారణమని శ్రుతిస్మృతి పురాణాలన్నీ స్పష్టంగా తెలుపుతున్నాయి. బంధము అంటే జీవిని ప్రాపంచిక విషయసుఖాల అనుభవాని కోసము జననమరణ దుఃఖాది రూపమైన సంసారములో తిప్పుతూ అంతము లేని శ్రమను కలుగజేసేది అని అర్థము. మోక్షము అంటే మనసు విషయసుఖాపేక్షను వదలిపెట్టి సర్వానందాలకు నిధానమైన ఆత్మస్వరూపములో లీనమైపోవుట అని అర్థము.

ఐతే అనేక కల్పాల (కల్పమంటే 432 కోట్ల మానవ సంవత్సరాలు) నుండి అనేకదుఃఖాలను ఎదుర్కొంటూ గూడా విషయసుఖానుభవము (శబ్ద స్పర్శరూపరసగంధాలు) వైపే ఆకర్షణ గల మనసు, ఆ మార్గాన్ని వదలిపెట్టి ఆత్మానందాన్ని పొందే మార్గము లోకి రావటానికి ఇష్టపడదు, కూపస్థ మండూకము మాదిరి. ఐనాగూడా అనేక జన్మల పుణ్యము గల సజ్జనులకు మాత్రము ఆత్మప్రాప్తి లేదా అధ్యాత్మయోగమార్గము మీద ఆసక్తి కలుగుతుంది. ఆత్మస్థితిని చేరాలంటే శ్రీమద్భగవద్గీత క్షేత్రక్షేత్రజ్ఞ విభాగ యోగంలో జ్ఞానము అని చెప్పబడిన అమానిత్వాది గుణాలను సంపాదించి దృఢము చేసుకోవాలి, ఎవరు ఈ పనిని చెయ్యాలి? అంటే మనసే చెయ్యాలి.

ప్రజాసౌకర్యానికి అవసరమైన అనేక వస్తువులు, ఉపకరణాలను (యంత్రాలను) పరిశ్రమలలో ఉత్పత్తిని చేస్తుంటారు. ఉదా: సైకిళ్ళు, టివీలు, మిక్సీలు, కుక్కర్‌లు, లైట్లు, ఫానులు, మోటారుసైకిళ్ళు, గడియారాలు, సెల్‌ఫోనులు, కంప్యూటర్‌లు, బస్సులు, రైళ్ళు, విమానాలు ఇత్యాదులు. ఈ ఉపకరణాలన్నీ ప్రమాదాలను కలిగించకుండా చక్కగా

పనిచేసి ప్రజాజీవితాన్ని సుఖమయం చెయ్యాలి గదా! అందు చేత వీటిని బహుళ సంఖ్యలో తయారుచేసి ప్రజలకు అందించే ముందు వాటి నమూనాలను అధికారిక పరీక్షాకేంద్రాలకు పంపి, ఫరీక్షా మూల్యాన్ని చెల్లించి పరీక్షలను చేయిస్తారు. అక్కడ ఆయా ఉపకరణాలపైన పూర్తి స్థాయిలో చాలా కఠినమైన పరీక్షలను నిర్వహిస్తారు. నిర్ధారితమైన ఉష్ణోగ్రతలు, వేగము, కంపనాలు, ఒత్తిడి, క్రిందపడవేయుట ఇంకా సంబంధింత తదితరపరీక్షలను నిశితముగా జరుపుతారు. అన్ని పరీక్షలలో గూడా ఆ ఉపకరణాలు సక్రమంగా పనిని చేస్తే అప్పుడు వాటికి ఒక అధికారిక ప్రమాణపత్రాన్ని (సర్టిపికేట్) జారీ చేస్తారు ఉత్పత్తిదారులకు. అటువంటి ప్రమాణపత్రము గల ఉపకరణాలను ప్రజలు, పరిశ్రమలు చాలా విశ్వాసంతో కొనుగోలు చేస్తారు, అవి తప్పకుండా బాగా పని చేస్తాయి అనే భావంతో.

అదే విధంగా సాధనను చేస్తున్న ముముక్షువుయొక్క మనసు గూడా వాసనలను, గుణాలను, కోరికలను, అధిగమించిందా లేదా అని నిర్ణయించడానికి అనేకమైన పరీక్షలు అవసరమౌతాయి. శ్రీమద్భగవద్గీత భక్తియోగంలో వివరించిన "అద్వేష్టా సర్వభూతానాం... అన్నది మొదలుకొని తుల్యనిందాస్తుతి ర్మౌనీ..." అని చెప్పిన దాని వరకు గల లక్షణాలన్నింటినీ ఇంకా క్షేత్ర క్షేత్రజ్ఞవిభాగ యోగంలో తెలిపిన "అమానిత్వం... తత్త్వజ్ఞానార్థ దర్శనమ్" అన్న దాకా గల సంస్కారాలు దృఢంగా సంపాదింపబడినాయి అని నిర్ణయించేసుకోవడానికి గూడా ఒక పరీక్షాకేంద్రము అవసరము. ఆ పరీక్షాకేంద్రము నుండి పొందిన ప్రమాణపత్రము ద్వారా సచ్చిదానంద పరమాత్మ స్థితిని పొందటము సాధ్యము.

అన్ని దేశాలలో వివిధమైన ఉపకరణాలకు పరీక్షా కేంద్రాలున్నాయి. ఐతే మనసుకు మాత్రము ఒక్క మన

భారతదేశములోనే పరీక్షాకేంద్రాలున్నాయి. మనదేశంలో అధర్మము అక్రమము, అవినీతి, అన్యాయము, మోసము, అసత్యము, లంచగొండి తనము, చౌర్యము ఇత్యాదులన్నీ ఎక్కువ స్థాయిలో వున్నాయనీ, ఇతరదేశాలలో ఆ విధంగా లేవనీ అనుకోవటము మనందరికీ తెలిసిన విషయమే. భారత వర్షము యొక్క గొప్పతనము పురాణాలలో విశేషంగా వివరించబడింది. ఉదా: శ్రీమద్భాగవతము 5వ స్కంధము 19వ అధ్యాయములో భారత వర్షమొక్కటే కర్మభూమి అని ఇక్కడ చేసిన పుణ్యపాపకర్మలవల్ల ఉత్తమాధమ ఉపాధులు, స్వర్గ నరకాలు ప్రాప్తిస్తాయనీ, జ్ఞానము వలన మోక్షం పొందవచ్చునని వర్ణించబడింది.

ఇతరదేశాలలో మానవజీవనము ప్రధానంగా యాంత్రికంగా సాగిపోతుంటుంది. ఆ దేశాలలోని న్యాయాలు చట్టాలు నియమాలు నిబంధనలు మనసుకు ఎటువంటి శ్రమను (మానసిక వేదనను) కలగనీయకుండా ఏర్పాటు చేసుకోబడ్డాయి, అనుసరించబడుతున్నాయి. అవి కేవలము విషయసుఖాలకు మాత్రమే పరిమితమైనవి. అందుచేతనే ఆ దేశాలలోని జీవనము చాలా సుఖంగా వుంటుంది. అక్కడ మనసును గెలిచే అవసరము అవకాశములు వుండవు. ఆదేశాలలోని జీవనాన్ని గురించి కొద్దిపాటి పరిచయము గల అందరికీ విదితమే.

భారతదేశ వర్షములో జన్మించిన వారి లక్ష్యము కేవలము శరీరపరమైన తాత్కాలిక సుఖాల కోసము మాత్రమే కాదనీ, తీవ్రమైన సాధనతో మనసును నిగ్రహించి, జననమరణ ప్రవాహరూప సంసారము నుండి బయటపడి అనంతమైన ఆత్మానందాన్ని పొందడమే అని మన ఋషులు, శాస్త్రాలు పదే పదే బోధిస్తున్నారు.

మనోనాశము అన్నది బ్రహ్మానుభూతికి అంగము. యథార్థముగా మనసే తన చంచలత్వ స్వభావముచేత జ్ఞానేంద్రియాల ద్వారా ఈ ప్రపంచ విషయాలను కార్యకలాపాన్ని దర్శిస్తుంది. ప్రతిప్రాణి గూడా

ఆత్మస్వరూపమే ఐనాగూడా మనసుతో తాదాత్మ్యాన్ని చెంది తన స్వరూపమైన స్వతంత్రమైన ఆనందస్థితిని మరిచిపోయింది. మనసు యొక్క సుఖదుఃఖానుభూతులన్నింటినీ తనవిగా భావిస్తున్నది. సుఖాలను సంపాదించుకొనడానికి దుఃఖాలను పరిష్కరించు కొనడానికి నిర్విరామంగా అనేక ప్రయత్నాలను చేస్తుంటుంది. దైనందిన కార్యకలాపంతో అలిసిపోయి, సర్వవృత్తులను విడిచిపెట్టి మనసు పనిచేయని స్థితిలో విశ్రాంతిగా వుంటుంది. అదే మనిషికి సుషుప్తి లేక గాఢనిద్రావస్థ అని చెప్పబడింది. శరీరము ఇంకా మనసుల సంపర్కము లేనందున ఆత్మ తన స్వరూపస్థితిలో ఆనందంగా వుంటుంది. ఇది అందరి సత్యానుభవమే గదా! అటువంటి స్థితిని (ఆనందస్థితిని) జాగ్రదవస్థలో సంపాదించుకొనడానికి మనోనాశనాన్ని గొప్పప్రయత్నంతో సాధించాలి. అంటే అన్ని రకాల ప్రపంచ కార్యకలాపాలకు మనసు స్పందించగూడదు అని అర్థము. మనసుతో సంగము లేని స్థితికే మోక్షము కైవల్యము అని పేరు.

లోకంలో అన్యాయాలు అధర్మాలు ఇత్యాదులు అన్ని కాలాల్లో గూడా వున్నాయి అని పురాణాలు చరిత్రల ద్వారా తెలుసుకొనవచ్చును. హిరణ్యకశిపుడు, రావణాసురుడు, కంసుడు జరాసంధుడు వంటి అనేకుల చేత ప్రతి యుగంలోనూ ప్రజలకు తీవ్రమైన పీడలు ప్రాప్తించాయి. అన్ని దేశాలలో గూడా కొన్ని సమయాలలో క్రూరులు నియంతలు ఐనవారి వలన మానవాళికి వేదనలు కలిగాయని చరిత్ర తెలుపుతున్నది. ఏదైనాగానీ ప్రస్తుతము బాధలను అనుభవిస్తున్న వారు తమ కాలంలోనే అన్యాయాలు ఎక్కువైనాయని భావించటము సహజము.

భక్తులు, భాగవతులు, జ్ఞానులు, ఋషులు, యోగులు ఐనవారెందరో వారిపైన జరిగిన దౌర్జన్యాలను నిందలను, రాజుల శిక్షలను ధైర్యంగా ఎదుర్కొని మనసులను పూర్తిగా గెలిచి పరమాత్మ స్థితిని పొంది చిరస్మరణీయులైనారు.

వార్ల అనుయాయిాలమైన మనము గూడా ఈదేశములో, ఏ మూల్యమునూ చెల్లించకుండా ఉచితంగా లభించే అన్ని రకాల మానసిక పరీక్షలను సమర్థవంతంగా ఎదుర్కొని, మనసులను జయించి ఆత్మ సామ్రాజ్య పట్టాభిషిక్తులమై ఆనందంగా ఉండెదము గాక.

పరమహంస ప్రసాదము

- శ్రీరామకృష్ణ పరమహంస

1. భగవంతుణ్ణి తప్పక దర్శించవచ్చు. సాకారం, నిరాకారం రెండింటినీ దర్శించవచ్చు. భగవంతుని సాకారమైన చిన్మయరూపాన్ని దర్శించవచ్చు. మానవరూపం దాల్చిన భగవంతుణ్ణి ప్రత్యక్షంగా దర్శించవచ్చు. అవతారమూర్తిని దర్శించడం సాక్షాత్తు భగవంతుని దర్శించినట్లే అవుతుంది. ప్రతియుగంలోనూ ఈ ఇలలో భగవంతుడు మానవుడుగా అవతరిస్తున్నాడు.
2. ఎవరైతే ఇష్టదైవమో ఆయనే గురురూపంలో వస్తాడు. పిదప గురువు ఇష్టదైవంలో లీనమైపోతాడు.
3. భగవన్నామ బీజాక్షరాలలో గొప్పశక్తి ఉంది. ఆ శక్తి అవిద్యను నశింపజేస్తుంది. బీజం మృదువైనది. అంకురం లేతగా వుంటుంది. అయినప్పటికి అది కఠినమైన నేలను చీల్చుకొనివస్తుంది. నేల బీటలు వారి అంకురానికి దారినిస్తుంది.
4. భక్తులు నామ గుణ సంకీర్తనచేస్తున్న చోట్లుకు భగవంతుడే స్వయంగా వచ్చి ఆలకిస్తాడు. భక్తుల పాదముద్రలచే ఆ స్థలంలోని ధూళి పావనత్వాన్ని సంతరించుకొంటుంది.
5. అంధకారబంధురమైన ఈ కలియుగంలో సత్యసంధతే అసలైన నిజమైన ఆధ్యాత్మిక సాధన.

ఆత్మ విశ్వాసం

– డా॥ సముద్రాల లక్ష్మణయ్య, తిరుపతి

యస్య నాస్త్యథ విశ్వాసో జనస్య పరమాత్మని ।
తమేవ నాస్తికం ప్రాహుః ప్రాచీనాని మతాని తు ॥

యస్య నాస్త్యాత్మ విశ్వాసః స ఏవ ఖలు నాస్తికః ।
ఇతి బ్రవీత్యాధునికం మతం పశ్య తదంతరమ్ ॥

(శ్రీ వివేకానందసూక్తి సుధ నుండి)

"ఎవనికి దేవునిపై విశ్వాసం లేదో, వాణ్ణి ప్రాచీన మతాలు నాస్తికుడన్నాయి. ఎవనికి తనపై తనకు నమ్మకం (ఆత్మవిశ్వాసం) లేదో, అతడే నాస్తికుడని నేటి మతం చెబుతున్నది. అందులోని తేడాను గమనించండి" – అని వివేకానందుని వాణి.

విశ్వాసమంటే నమ్మకం. నమ్మదగినవాటిని నమ్మాలి. నమ్మదగని వాటికి దూరంగా వుండాలి. నమ్మకం పరిస్థితులను బట్టి కూడా ఆధారపడి వుంటుంది. గ్రుడ్డి నమ్మకాల వల్ల మేలుకంటే కీడే ఎక్కువగా జరుగుతుంది.

కుమారుడు తల్లి దండ్రులనూ, శిష్యుడు గురువునూ, ప్రజలు దేశక్షేమం కోరే పరిపాలకులనూ తప్పక విశ్వసించాలి.

"విశ్వాసం మనుజుని ఊర్ధ్వ లోకానికీ, అవిశ్వాసం అధోలోకానికీ తీసుకుపోతాయి" – అని శ్రీ మలయాళ సద్గురు స్వాములవారు ప్రబోధించారు. ఆధునిక యతీశ్వరులలో అగ్రగణ్యుడు శ్రీ వివేకానందస్వామి. ఆ మహనీయుడు ఆత్మ విశ్వాసాన్ని గురించి

పదే పదే ప్రబోధించేవారు. ఆత్మవిశ్వాస ప్రాముఖ్యం ఉపనిషత్తులలో చక్కగా ప్రతిపాదించబడింది. ఆత్మను విశ్వసించిన వ్యక్తి ఏ కార్యమైనా సాధించగలడు.

మనుజుల ఉత్సాహం, త్యాగం, విశ్వాసం – ఈ మీడు గుణాలూ కలిసి ఈ జగత్తును రూపొందించాయి కాన విశ్వాసం మిక్కిలి ముఖ్యమైనదని వివేకానందుని ఉపదేశం.

ఉత్సాహత్యాగవిశ్వాసై ర్మనుజానాం సహోదితైః ।
సువిశాలం జగదిదం నిర్మితం నాత్ర సంశయః ॥

'గతకాలము మేలు వచ్చు కాలముకంటెన్' అన్నట్లు రానున్న కాలం కంటే గడచిన కాలం మేలైనదని గతకాలాన్ని విశ్వసిస్తారు.

గతించిన కాలం మేలైనదని నిస్సంశయంగా నమ్మండి! కాని రాబోయే కాలం ఇంకా మహోజ్జ్వలంగా ఉండగలదని తన దృఢవిశ్వాసమని వివేకానందుల సూక్తి. అనవద్యమైన విద్య, దృఢమైన శ్రద్ధ, అకుంఠితమైన ఆత్మవిశ్వాసం – ఈ మూడు గుణాలూకలవారు తప్పక విజయం సాధిస్తారని వవివేకానందుని ఆశయం.

మహాత్ముల జీవితాలలో అనంతమైన శక్తి కనిపిస్తున్నది. దానివల్ల ఎలాంటి కార్యాలనైనా వారు సాధించగలుగుతున్నారు. అందుకు కారణం వారిలోని ఆత్మవిశ్వాసమే.

సముద్రాలనైనా త్రాగివేస్తాను, కొండలైనా నా సంకల్పబలంతో పిండి కాగలవు – అన్నంత దృఢమైన నిశ్చయబుద్ధి, ఉత్సాహం, శ్రమ శీలత, విశ్వాసం అనేవి ఉంటే లక్ష్యసాధనలో తప్పక విజయం సిద్ధిస్తుంది. మహత్తర కార్యాలను విజయవంతంగా నిర్వహించిన మహాత్ముల చరిత్రలు ఈ విషయాన్నే నిరూపిస్తున్నాయి.

రామాయణంలో 7 కాండలు, 24వేల శ్లోకాలు ఉన్నాయి.

అది ఆదికావ్యంగా ప్రసిద్ధమయింది. ప్రపంచ సాహిత్యంలోనే సాటిలేని మేటి గ్రంథంగా రాణిస్తున్నది. వేదమే రామాయణంగా వాల్మీకిద్వారా అవతరించిందని పెద్దల మాట.

వాల్మీకికి గల ఆత్మవిశ్వాసం ఎంత ఘనమైనదో ఆయన చెప్పిన ఈ క్రిందిమాటలవల్ల తెలుస్తున్నది.

యావత్ స్థాస్యన్తి గిరయ స్సరితశ్చ మహీతలే ।
తావద్రామాయణకథా లోకేషు ప్రచరిష్యతి ॥

హిమాలయాది పర్వతాలూ, గంగాదినదులూ ఈ భూతలంలో ఎంతకాలం ఉంటాయో, అంతవరకూ ఈ రామాయణ కథ లోకంలో ప్రచారంలో ఉండగలదని భావం.

ఒక కవి తన రచనను గురించి ఈమాట చెప్పాలంటే ఆయనకు ఎంత దృఢమైన ఆత్మ విశ్వాసం ఉండాలో - గ్రహించండి.

ఇక లక్ష శ్లోకాలు గల్గి పంచమవేదంగా ప్రసిద్ధమైన మహాభారతాన్ని రచించిన వేదవ్యాసుడు తన రచనను గురించి అన్న మాటలు పరిశీలించండి.

ధర్మే చార్థేచ కామేచ మోక్షేచ భరతర్షభ ।
యదిహాస్తి తదన్యత్ర యన్నేహాస్తి న తత్క్వచిత్ ॥

"ధర్మం, అర్థం, కామం, మోక్షం - అనే నాలుగువిధాలైన పురుషార్థాల విషయంలో ఈ గ్రంథంలో ఏది చెప్పబడివున్నదో అదే ఇతర గ్రంథాలలో వుంటుంది. ఇందులో లేనిది ఎందులోనూ ఉండదు."

తాను రచించిన గ్రంథాన్ని గురించి ఇలా ప్రకటించిన మహా కవికి తనపై ఎంత గట్టి విశ్వాసం ఉండవలెనో, గమనించండి! వాల్మీకి వ్యాసాదులేకాదు, ఘనకార్యాలు విజయశీలంగా పూర్తి చేసిన మహా మహులందరూ ఇట్టి ఆత్మ విశ్వాసం కలవారే.

అచంచలమైన భగవద్విశ్వాసం గల భక్త శిరోమణులు గూడా దృఢమైన విశ్వాసంకలవారే. ముప్పది రెండు వేల కీర్తనలతో ఏడుకొండల దేవుణ్ణి కీర్తించిన అన్నమాచార్యులవారు

"నిన్ను నమ్మి విశ్వాసము - నీపై నిలుపుకొని
ఉన్నవాడ నిక వేరే - ఉపాయమేమిటికి?" అన్న కీర్తనలో తనకు గల భగవద్విశ్వాసాన్ని ప్రకటించాడు. విశ్వాసము యొక్క విలువ గ్రహించినవారు "శ్వాస పోయినా పరవాలేదు, విశ్వాసం మాత్రం పోరాదు" అని నొక్కి వక్కాణిస్తారు.

గురువు విద్యపట్ల విశ్వాసం క్రమక్రమంగా వృద్ధి పొందేటట్లు శిష్యుణ్ణి ప్రోత్సహించాలి. అతణ్ణి నిరుత్సాహ పరచగూడదు. ఈ హెచ్చరిక తల్లి దండ్రులకు గూడా వర్తిస్తుంది.

ఆధ్యాత్మిక మార్గంలో పయనించే సాధకులను వేదాంతశాస్త్రం ఎంతగానో ప్రోత్సహిస్తుంది. "అమృతస్య పుత్రాః!" అని అది సాధకులను సంబోధిస్తుంది. "ఓ అమృత పుత్రులారా!" అని సంబోధించడంలోనే జీవులను మరణరహితమైన శాశ్వతాత్మ స్వరూపులనుగా శ్రుతి వర్ణిస్తున్నది.

వేదాంతం పాపాన్ని అంగీకరించదు. 'నీవు పాపివి' ఇత్యాది నిందావచనాలు వేద దృష్టిలో ఏ మాత్రం తగవని మహనీయులు చెప్పారు.

గీతాశాస్త్రాది గ్రంథాలను వివరించే వ్యాఖ్యాతలు కొందరు ద్విజేతరులన్నూ, స్త్రీలనూ పాపజన్ములని (పాపయోనులు) పేర్కొన్నారు. ఇది సహింపరాని విషయం అక్కడ 'పాపయోనయః, అన్న విశేషణాన్ని స్త్రీలకూ, వైశ్యులకూ, శూద్రులకూ - అన్వయించరాదు. ఈ విషయాన్ని శ్రీ సద్గురు మలయాళస్వాములవారు నిశితంగా ఖండించారు.

'సమ బుద్ధే యిందరికీ - సర్వవేదసారము' అని అన్నమయ్య మాట. పండితులు సమదర్శనులై ఉండాలి. అంతేకాని జన్మకారణంగా కొందరిని తక్కువగా భావించడం తగదు. అలా భావించడం వల్ల వారి ఆత్మ విశ్వాసం దెబ్బతింటుంది.

ఈలోపాన్ని సరిదిద్దడానికే శ్రీవివేకానందులు, శ్రీనారాయణ గురువు, శ్రీ మలయాళస్వాములవారు - మున్నగు మహాత్ము లీయుగంలో అవతరించారు. ఆత్మ విశ్వాసం పెంపొందించుకొని అభివృద్ధిని సాధించాలంటే - ఆ మహాత్ముల అడుగుజాడల్లో పయనించాలి.

న్యాయదర్శనము

దీని ప్రవర్తకుడు గౌతముడు, నైయ్యాయికులు ప్రత్యక్షం, అనుమానం, ఉపమానం, శబ్దం అనే నాల్గు ప్రమాణాలనే అంగీకరిస్తారు.

నైయ్యాయికుల మతంలో 1.ప్రమాణం, 2.ప్రమేయం, 3.సంశయం, 4.ప్రయోజనం, 5.దృష్టాన్తం, 6.సిద్ధాన్తం, 7.అవయవం, 8.తర్కం, 9.నిర్ణయం, 10.వాదం, 11.జల్పం, 12.వితండం, 13.హేత్వాభాసం, 14.చలం, 15.జాతి, 16.నిగ్రహస్థానమని 16 పదార్థాలున్నవి. వీరియొక్క పరమ లక్ష్యం మోక్షమే. అది తత్త్వజ్ఞానం చేత సిద్ధిస్తుంది. ఆత్మ దేహేంద్రియ మనోబుద్ధులకంటే భిన్నమే. అజ్ఞానంచేత అభిన్నంగా తోస్తుంది. వాటి యథార్థ స్వరూపాన్ని తెలుసుకొంటే బంధం పోయి మోక్షం లభిస్తుంది.

వీరిమతంలో మనస్సు అణుపరిమాణం, నిత్యమున్ను, ఇన్ద్రియాల ద్వారా ఆత్మకు విషయాలతో సంపర్కం ఏర్పడినప్పుడు జ్ఞానం కలుగుతుంది. ఇట్టి జ్ఞానం ఆత్మకు సహజం కాదు. ఆగంతుకం. ముక్తావస్థలో ఏ జ్ఞానమూ వుండదు.

శ్రీసరస్వతీస్తోత్రమ్

- శ్రీ అఖణ్డానన్దగిరి స్వాములవారు

శ్లో ॥ ప్రణమామి పరాశక్తిం హంసవాహనశోభితామ్ ।
బ్రహ్మాణీం మాతరం వన్దేహ్యఖండానన్దసిద్ధయే ॥ 1

ప్రణవానన్దధాత్రీం విశ్వమ్భరవివేచినీమ్ ।
వన్దే సరస్వతీం విద్యాం అఖండానన్దసిద్ధయే ॥ 2

కావ్యశాస్త్రవినోదేన కాలో గచ్ఛతి ధీమతామ్ ।
సుధీభిస్సేవితాం నౌమి త్వఖండానన్దసిద్ధయే ॥ 3

త్వం దేవి వాణి! శర్వాణి! వీణాగానవినోదిని ।
శ్వేతవస్త్రాం భజామి త్వాం అఖండానందసిద్ధయే ॥ 4

సురాసురాదిభిః పూజ్యాం సౌమ్యరూపాఞ్చ శారదామ్ ।
అచిన్త్యామమ్బికాం నౌమి హ్యఖండానందసిద్ధయే ॥ 5

చైతన్యరూపిణీం విద్యాం ఐంకారరూపిణీం భజే ।
లక్ష్మీం త్వాం వైష్ణవీం దేవీం అఖండానందసిద్ధయే ॥ 6

రామే శ్యామే చ యా విద్యా సాశక్తిశ్చవిముక్తయే ।
మదభిన్నాం చరాచరేష్వఖండానందసిద్ధయే ॥ 7

త్వత్కృపారహితో మూకః సృష్టిస్థిత్యన్తబోధినీ ।
బ్రహ్మణ భిన్నా భజే వాణీం అఖండానందసిద్ధయే ॥ 8

శ్రీగురోః కృపయా దేవ్యాస్సదా సజ్జనశక్తిభిః ।
అఖణ్డానన్దగిరిర్యాఖ్య స్వామినేరితమష్టకమ్ ॥ 9

" ఇతి శ్రీసరస్వతీదేవ్యష్టకం సమ్పూర్ణమ్ "

మంగళం - శుమంగళమ్

- ఆచార్య కె.సర్వోత్తమరావు

దీక్షితర్ 'మంగళాంబిక '

గురుగుహ దేవతోపాసకులలో ఒకరయిన దీక్షితర్ 'మంగలాంబికను' కీర్తించిన వాడు. వారి కీర్తనలలో ప్రసిద్ధమయినవి మూడు. మొదటిది లక్ష్మీదేవికాగా తరువాతవి సర్వమంగళవి.

ప. మంగళదేవతయా త్వయా బహుమానితోఽహం ॥ శ్రీ॥
పుంగవకమలాలయా భోగభాగ్యాలయా
జంగమస్థావరలోకజనన స్థితిలయా జయ ॥ మంగళ ॥

హరిద్రాకుంకుమ వస్త్రాలంకృత విగ్రహయా
దరిద్రదుఃఖాది మూర్ధన్యా శివనిగ్రహయా!
పరదరాజగోపాల హృదయా !
సరసిజగ్రహయా వరలక్ష్మ్యా హరిహరగురుగహ భక్తానుగ్రహయా
సురార్చిత పదాంబుజయా! సుధాసా
గరాత్మజయా సురవినుత శివానుజయా! మాయాలీలయా విజయా!

పం. మంగళదేవతే పరదేవతే మంగళం భవతు నత దేవతే

అ.పం. అంగజపురకాల వైరహితే అనాద్యవిద్యాప్రపంచ రహితే ।
పుంగవ గురుగుహాది మహిత సత్యంగిమార్గదర్శితే సురహితే॥

ప. మంగళాంబాయై నమస్తే
శ్రీవాంఛలింగనిజసక్తే విలీన చిచ్ఛక్తే ॥శ్రీ ॥

అ. సంగీత సాహిత్య సారజ్ఞసన్నుతే మంగళాలయగుప్త
గంగాతటస్థితే అనంగాద్యుపాసితే
శృంగారాదియుతే మంగళాంబ

మందస్మితాననే మాళవ శ్రీజనే
ఇందిరాలోకనే ఈశ్వరాధనే

ఇందీవరాసనా దీడిత శివాంగనే
సిందూర కస్తూరి చందనాలేపనే
కుందముకుళరదనే గురుగుహ హృత్సదనే
సుందరి మృదుగదనే సుఖతరకరమదనే మంగళాంబ ॥

సుందరకాండ పారాయణక్రమంలో ' మంగళశ్లోకం "

ఆస్తిక్యచింతన కలవారు 'సుందరకాడకు' ఎనలేని ప్రాధాన్యమిస్తారు. బుద్ధిర్బల యశాదులను ప్రసాదించే ఆంజనేయుని సముద్రలంఘన ఈ కాండలో వర్ణితం. అంతేగాక బాధలలో, గ్రహసంచారం బాగాలేని రోగపీడితుల ఆరోగ్యం కోసం సుందరకాండ పారాయణం చేయడం అలవాటు. ఈ పారాయణ సమాప్తిలో మంగళశ్లోకాలు చదివే సంప్రదాయముంది. ఇందులో మొదటిది -

మంగళం కోసలేంద్రాయ మహనీయ గుణాత్మనే
చక్రవర్తి తనూజాయ సార్వభౌమాయ మంగళమ్

చివరిది -

ఆసాద్య నగరీం దివ్యామభిషిక్తాయ సీతయా
రాజాధిరాజరాజాయ రామభద్రాయ మంగళమ్ ॥

శ్రీ వేంకటేశ్వర సుప్రభాతంలో మంగళాశాసనం

సుప్రసిద్ధమయిన శ్రీవేంకటేశ్వర సుప్రభాతంలో చివరిది శ్రీవేంకటేశ్వర మంగళాశాసనం. 14 శ్లోకాలు గల మంగళాంత శ్లోకాల సమాహారం. ఈ శ్లోకాలలో మొదటిది -

శ్రియః కాంతాయ కల్యాణ నిధయే నిధయేర్థినామ్ ।
శ్రీవేంకటనివాసాయ శ్రీనివాసాయ మంగళమ్ ॥

చివరిది -

మంగళాశాసనపరై ర్మదాచార్య పురోగమైః
సర్వైశ్చ పూర్వై రాచార్యైః సత్కృతాయాస్తు మంగళమ్ ॥

ఈ సుప్రభాతంలో లాగే ఇతర చిన్న, పెద్ద అర్చామూర్తులపై వ్రాసిన సుప్రభాతాలలో కూడా మంగలాశాసనం చెప్పడం ఒక సంప్రదాయ మయింది.

వివాహాలలో 'మంగళాష్టకం '

హైందవసంస్కారాలలో వివాహానికి మహోన్నతస్థానమున్నది. ప్రాచీనులు వివాహాన్ని యజ్ఞంగా, పరమపవిత్రకర్మగా భావించారు. ఈ సంస్కారం సమస్త సంస్కారాలకు కేంద్రస్థానం. అలాంటి వైవాహికపు తంతులలో కన్యామహాదానం ఒకటి. ఈ దానానికి ముందు వధూవరుల మధ్య తెరపట్టడం ఒక ఆచారం. ఈ సందర్భంలో సంకల్పంతోబాటు **'మంగళాష్టకం'** చదవడం సంప్రదాయం. ఈ సంకల్పంలో మంగళాష్టకంలో సమస్త పర్వత, నదీనద, దేశ, పుణ్యతీర్థ, ఖండ మహారణ్య, ద్వీప, వర్ష, కల్ప, మన్వంతర, మహాయుగాల ప్రస్తావన ఉంటుంది. అష్టకంలోని ఒక్కొక్క శ్లోకం చదువుతుంటే **కుర్యాద్ధ్రువం మంగళమ్** అని శ్రావ్యంగా పాడుతుంటే **తథాస్తు** అనడం సంప్రదాయం.

మంగళసూత్రధారణ హైందవులలో పవిత్రకార్యం. ఆ సందర్భంలో వరుడు వధువుకు ఎదురుగా నిలబడి

మాంగల్యం తంతునానేన మమ జీవనహేతునా
కంఠే బధ్నామి సుభగే త్వం జీవంతు శరదాం శతమ్

అనే శ్లోకాన్ని చదువుతూ వధువు మెడలో మాంగల్యసూత్రం కట్టడం, ఆ సందర్భంలో ముడులకు కుంకుమ పూయడం సంప్రదాయం.

5. కావ్యరచనాసంప్రదాయంలో 'మంగళాంశ'.

'మంగళాదీని, మంగళమధ్యాని, మంగళాంతానిచ' అని ఆలంకారికులు కావ్యరచనా కుతూహలపరులకు సూచన చేశారు. ఈ దృష్టితోనే సంస్కృతాంధ్రకవులు కావ్యాది శుభవర్ణాలతో శ్లోకాలు పద్యాలు వ్రాశారు.

'అక్షరాణా మకారోస్మి' అని గీత. 'అగ్నిమీళే' అని వేదం అకారంతో ప్రారంభం. అందుకే కాబోలు కాళిదాసు 'అస్త్యుత్తరస్యాం' అని అకారంతో కుమారసంభవ రచన సాగించాడు. కాని సంస్కృతంలో వకారాది కావ్యాలు ప్రసిద్ధాలుగా రాణించాయి. రఘువంశం, 'వాగర్థావివ' అని వకారంతో మొదలయింది.

ఓం కారంతో మొదటి అక్షరం ఓ. ఓ అనేది అకార ఉకారాల కలయిక. అ + ఉ = ఓ. రెండవ అక్షరం మ్. అ కంఠ్యం - మకారం ఓష్ఠ్యమ్. అకార ఉకారాల కలయికను తిరగవేస్తే ఉ + అ = వ. ప్రణవాన్ని విపరీతక్రమంలో పలకడంవల్ల శక్తి రెండింతలవుతుంది. అందుకే వకారంతో కావ్యాది శ్లోకం. విష్ణు సహస్రనామం 'విశ్వం'తో మొదలు. వేంకటేశసహస్రనామం **'వేంకటేశో విరూపాక్ష'తో** మొదలు. ఆదిశంకరుల దిక్షిణామూర్తిస్తోత్రం 'విశ్వం దర్పణ దృశ్యమానం నగరీ'తో మొదలు.

తెలుగు కవులయితే శ్రీకారంతో కావ్యాన్ని మొదలుపెడతారు. ఆ అంశం గురించి అప్పకవి చక్కటి విశ్లేషణ చేశాడు.

వేదముల కెల్ల నోంకారమాది యైన
కరణిఁగృతులకు నెల్ల శ్రీకారమాది
గానఁగవివరులెల్లను దాని దక్క
నితరవర్ణంబు లిదరు సత్కృతుల మొదల

(మిగతా 34వ పేజీలో...)

హరన్త్యఘం తేఽఙ్గసఙ్గాత్

– శ్రీవిద్యాప్రకాశానందగిరి స్వాములవారు

పూర్వము "అంశుమంతుడను మహారాజు కపిలమహాముని యొక్క శాపముచే భస్మీభూతులైన తన పితరులగు సగరపుత్రులను ఉద్ధరించునిమిత్తము గంగానదిని స్వర్గమునుండి భూలోకమునకు తెచ్చుటకై ఘోరతపంబాచరించి విఫలుడయ్యెను. తదుపరి యాతని సుతుడగు దిలీపుడున్ను అట్లే తపంబు సల్పినను గంగావతరణమును సాధింపలేకపోయెను. పిమ్మట దిలీపుని తనయుడగు భగీరథుడు ఎట్లైనను గంగను భూలోకమునకు దెచ్చి తనపితరులను పునీతులుగజేసి వారలనుద్ధరింప కృతనిశ్చయుడై ప్రచండ తపంబు సల్పెను. తత్ఫలితముగ గంగాదేవి ప్రత్యక్షమై యాతనితో నిట్లనియె.

కిం చాహం న భువం యాస్యే నరా మయ్యామృజన్త్యఘమ్ ।
మృజామి తదఘం కుత్ర రాజంస్తత్ర విచిన్త్యతామ్ ॥ (భాగ. 9-9-5)

ఓ భగీరథ మహారాజా! నేను భూలోకమునకురాను. ఏలననగా జనులు నాయందు తమతమ పాపములను కడిగివేసికొందురు. మరల వారిపాపమునంతను నేనెక్కడ కడుగుకొందును? కాబట్టి ఈ విషయమును నీవు తప్పక ఆలోచించవలసియున్నది."

గంగాదేవియొక్క ఆ పలుకులను వినగనే భగీరథుడు తత్క్షణమే ఈక్రింది ప్రత్యుత్తర మొసంగివైచెను.

సాధవో న్యాసినః శాన్తా బ్రహ్మిష్ఠా లోకపావనాః
హరన్త్యఘం తేఽఙ్గసఙ్గాత్ తేష్వాస్తే హ్యఘభిద్ధరిః ॥ (భాగ. 9-9-6)

" ఓ గంగాదేవీ! అట్టి యాలోచన నీ కవసరములేదు. ఎందుకనగా, నీయందు స్నానమొనర్చునది కేవలము పాపాత్ములేకాదు.

సాధువులు, పుణ్యాత్ములు, సర్వసంగ పరిత్యాగులు, శాన్తహృదయులు, బ్రహ్మనిష్ఠులు, లోకపావనతత్పరులునగు మహనీయు లెందఱోకూడ నీయందు స్నానమొనర్చుదురు. నీయందు వదలబడిన పాపమును వారు తమ అవయవస్పర్శచే హరించివైచుదురు. ఏలననగా వారియందు పాపములను ధ్వంసముచేయు శ్రీహరి నివసించుచున్నాడు" భగీరతుని యాతత్త్వబోధకవచనముల నాలకించి గంగాదేవి సంతుష్టయై భూలోకమున నవతరించి సర్వజనోద్ధారము గావింపదొడగెను.

భగీరథుడు పలికిన పై వాక్యములద్వారా మూడు గొప్ప రహస్యములు బోధపడుచున్నవి. అవియేవియనిన – 1. భగవానుడు పాపమును హరించివేయువాడు 2. బ్రహ్మనిష్ఠులందు, పుణ్యాత్ములందు, పరోపకార పారీణులందు భగవానుడు విశేషముగ నభివ్యక్తమగు చుండును, 3. తమయందు పాపహరుడగు పరమాత్మలెస్సగ ప్రకాశించుట బట్టి బ్రహ్మనిష్ఠులగు మహనీయులు తమ సాంగత్యమహిమచే పరుల పాపములను ధ్వంసముచేసి వైచుదురు. కనుకనే శాస్త్రములందు సత్సాంగత్యమునకు విశేష ప్రాముఖ్యత నొసంగబడియున్నది.

'మహత్సఙ్గస్తు దుర్లభోఽగమ్యోఽమోఘశ్చ '
'తదేవ సాధ్యతామ్ తదేవ సాధ్యతామ్'

'మహాత్ముల సాంగత్యము దుర్లభమైనది. కష్టసాధ్యమైనది, అమోఘమైనది, దానినే సాధింపవలెను. దానినే సాధింపవలెను' – అని నారదులు తన భక్తి సూత్రములందు వివరించియుండుట ఈ సందర్భమున గమనింపదగి యున్నది. అధ్యాత్మమార్గమున పురోగమనము సల్పు ముముక్షువునకు పూర్వజన్మార్జిత పాపపంకిలము గొప్ప అవరోధముగా నుండును. గావున తప్పాపప్రక్షాళనము కొఱకై యతడు మహాత్ముల సాంగత్య సేవాభాగ్యములను తప్పక పొందవలసి

యున్నది. లోకమున మలినవస్తువు చుట్టును మలినాణువులు, శుద్ధవస్తువు చుట్టును శుద్ధాణువులు నిరంతరము ప్రసరించు చుండును. ఈ సూత్రము భౌతికక్షేత్రమందెట్లు సత్యమో ఆధ్యాత్మిక క్షేత్రమందును అట్లు సత్యమైయున్నది. కావున మహనీయులు, నిరంతర ధ్యాననిష్ఠాతత్పరులు, తపస్సంపన్నులు, భగవద్భక్తులు ఉండుచోట పవిత్రములైన శుద్ధాణువులు వ్యాపించి యుండును. అట్టి దివ్యవాతావరణమున ప్రవేశించు పాపాత్ముడుకూడ తత్తేజముచే ప్రభావితుడై పుణ్యాత్ముడుగ మారిపోవును. ఇదియే సత్సాంగత్య మహిమ.

కావున ముముక్షువులగువారు ప్రప్రథమమున సత్సాంగత్యము నలవరచుకొనిన వారై, పాపవిముక్తులై స్వస్వరూప పరిజ్ఞాన వ్యాప్తికి అనువైన నిర్మలహృదయరూప సుక్షేత్రమును సంపాదించుకొందురుగాక!

(మంగళం-శుభమంగలం 31వ పేజీ తరువాయి)

శుభదేవతాత్రయంబును
శుభఖచరత్రయము గలిగి శుభవాచకమై
యభిమత గాంచిన కతమున
శుభములు శ్రీకారమునను జొప్పడుటరుదే

శ్రీకారంలో శకారం, రేఫం, ఈ స్వరాలున్నాయి. శకారానికి ఈ కారానికి అధిదేవత లక్ష్మి అగ్ని దేవత. 'శ్రియ మిచ్ఛేత్ హుతాశనాత్' అని పురాణ వచనం ప్రకారం అతడును లక్ష్మీప్రియుడే. మూడు వర్ణాలకు శుభదేవతలే. మొదటి శ వర్ణానికి గ్రహం గురుడు. రేఫానికి గురుడు. ఈ స్వరానికి శుక్రుడు. అందువల్ల మూడు శుభగ్రహాలే. అంతేగాక 'కమలా శ్రీర్హరిప్రియా' అని లక్ష్మీనామం కావడంతో శుభవాచకం. అలాంటి శ్రీకారాది పద్యం సర్వశుభసంయుతం. పరుసం ఇనుమును బంగారం చేసేలాగున అన్ని అశుభాలను పరిహరించేది కనుక శ్రీకారం. తెలుగు కవులందరు శ్రీకారంతోనే కావ్యరచన చేశారు.

ముణ్డకోపనిషత్తు

(గత సంచిక తరువాయి)

---

6. ఏ అక్షరబ్రహ్మం వుందో అది కళ్ళు మొదలగు జ్ఞానేంద్రియాలకు గోచరం కానిది, ఇతరములైన కర్మేంద్రియాలకు గ్రాహ్యం కానిది (దొరకనిది). గోత్రం లేనిది (మూలపురుషుడు లేనిది), తెలుపు, నలుపు మొదలగు రంగులు లేనిది, కళ్ళు, చెవులు, చేతులు, పాదాలు మొదలగు ఇన్ద్రియాయాలు లేనిది. నిత్యము (సదావుండేది). అంతటా వ్యాపించినది, అణువుకంటే అణువు, తరగనిది, పృథివ్యాది అన్ని భూతాలకు - ప్రాణులకు కారణమైనది. అట్టి ఈ అక్షరతత్త్వాన్ని ధీరులు - జ్ఞానులు చక్కగా చూస్తారు.
7. ఏ ప్రకారం సాలెపురుగు తననుండే దారాలను సృష్టించి గూడును అల్లి మరల ఆ దారాలను తనలోనికి తీసుకొంటుందో, ఏ విధంగా భూమినుండి ఓషధులు పుట్టున్నాయో, ఏ ప్రకారం బ్రతికియున్న పురుషుని శరీరంనుండే కేశాలు, రోమాలు పుట్టున్నాయో, ఆ విధంగా అక్షర పరబ్రహ్మంనుండి ఈ విశ్వం-సమస్త జగత్తు సంభవిస్తూంది.
8. (అంతటికి కారణమైన) బ్రహ్మము తపస్సుచేత (జ్ఞానంచేత) వర్ధిల్లితూంది (వృద్ధిని పొందుతూంది). దానినుండే అన్నం-అవ్యాకృతం పుట్టూంది. ఆ అన్నం నుండే ప్రాణశక్తి (హిరణ్యగర్భుడు), ప్రాణశక్తి నుండి తపస్సు, సత్యమనే ఆకాశాది పంచభూతాలు ఉత్పన్న మవుతున్నవి. సత్యంనుండి భూర్భువాది లోకాలు, కర్మలు పుట్టున్నాయి. ఆ కర్మలందు కర్మఫలం - అమృతం పుట్టూంది.
9. ఎవడు సర్వజ్ఞుడో, క్షుణ్ణంగా తెలుసుకున్న సర్వవేత్తో, ఎవని చిన్తన (తపస్సు) జ్ఞానమయమో, అట్టి అక్షరబ్రహ్మం నుండి ఈ హిరణ్య గర్భుడనే బ్రహ్మ, నామరూపాలు, అన్నం (ఆహారం) కూడ పుట్టూన్నవి.

(ప్రథమ ముణ్డకంలో ప్రథమ ఖణ్డం ముగిసినది)

శ్రీమదాంధ్రభాగవతం - తృతీయస్కంధం

- వచనానువాదం - ఆచార్య జక్కంపూడి మునిరత్నం

(గతసంచిక తరువాత)

" విదురా! చెబుతున్నా జాగ్రత్తగా విను. విష్ణుమాయ ఎవరికీ జయింప వీలుకానిది. అది తర్కవితర్కాలకు అందేది కాదు. ఆద్యుడూ, అనంతుడూ, నిత్యమంగళ స్వరూపుడూ అయిన విష్ణువును బంధాలు, ప్రతిబంధకాలు, విపత్తులూ, విషాదాలూ ఏమీ చేయలేవు. మానవుడు నిద్రించేటప్పుడు సుఖదుఃఖాలతో కూడిన కలలెన్నో వస్తాయి. మెలకువ వచ్చాక వాటికి సంబంధించిన గుర్తులు కూడా మిగలవు. ఈవిధంగానే జీవుడుగా క్రీడించే దేవుడికి కూడా కష్టాలంటవు. అది ఎలా సాధ్యమని నువ్వనుకుంటావేమో? గుంటలోని నీటిమీద చంద్రుడి ప్రతిబింబం కదిలినట్టు కనిపిస్తుంది. అయితే ఆకాశంలో ఉండే చంద్రుడు కదలకుండానే ఉంటాడు కదా! ఆవిధంగానే జీవులందరి శరీర ధర్మాలతోనూ క్రీడించే ఈశ్వరుడికి కర్మబంధాలు లేశమాత్రం కూడా అంటవు సుమా! శరీరానికి సంబంధించిన గుణాలు మూడు. అవి సత్త్వగుణం, రజోగుణం, తమోగుణం. వాటిని నశింప జేసుకోవడానికి శ్రీహరి భక్తే చాలు. ఆపదలను అధిగమించేందుకు అయిదు ఇంద్రియాలను ఆ స్వామి అధీనంలో ఉంచాలి. నిశ్చలమనస్కులై సర్వేశ్వర సంకీర్తనం చెయ్యాలి. ఇన్ని మాటలెందుకు? ఎవరు హరిని పూజిస్తూ, కీర్తిస్తూ ఎల్లప్పుడూ ఆయన భక్తిలో నిమగ్నమై ఉంటారో వారు బ్రహ్మకంటే, శివుడికంటే కూడా ఉన్నతస్థానాన్ని కైవసం చేసుకుంటారంటే నమ్ము. అటువంటి వారి పుణ్యాన్ని పొగడడం ఎవరికీ సాధ్యంకాదు."

మైత్రేయుడి మాటలతో విదురుడు పరమానంద భరితుడయ్యాడు. శిరస్సువంచి ఆయనకు నమస్కరించాడు. వారిని మరీ మరీ మనస్సులో స్మరించాడు. " విష్ణువే విశ్వానికి " ఏకైక ప్రభువెలా అయ్యాడో, జీవుడికి కర్మబంధాలెలా కలుగుతున్నాయో నీ మాటలవల్ల విశదమైంది. దేవుడు స్వతంత్రుడనీ, జీవుడు అస్వతంత్రుడనీ

గ్రహించగలిగాను. అవిద్యను నశింపజేసుకోవడానికి అచ్యుతుణ్ణి ఆశ్రయించడమే ఏకైకమార్గమని అవగతమైంది. నారాయణుణ్ణి భజిస్తే సకల దుఃఖాలు మసిపోతాయి. మైత్రేయ మహర్షీ! విష్ణువు ప్రజాపతులచేత సృష్టి ఎలా చేయించాడో వివరించు. సృష్టి భేదాలను తెలియజేయి. మను వంశాలను, వంశానుచరితాలను వర్ణించి చెప్పు. భూమికి క్రిందాపైనా ఉన్న లోకాలను గురించి వాటి పరిస్థితుల గురించి విపులంగా విశదపరచు. దేవతలు, జంతువులు, మనుష్యులు, రాక్షసులు, గరుడులు, నాగులు, సిద్ధులు, సాధ్యులు, గంధర్వులు, ఖేచరులు వీళ్ళంతా ఎలా పుట్టారో చెప్పు. గర్భజాలు, స్వేదజాలు, అండజాలు ఎలా జన్మించాయి? విష్ణుదేవుడి అవతారాల గురించి, వేదవిశిష్టత గురించి విపులీకరించు. విష్ణుదేవుడి అందచందాలను, గుణగణాలను చక్కగా నాకు బోధపరచు. నాలుగు వర్ణాల గురించి, నాలుగు ఆశ్రమాల గురించి సమగ్రంగా తెలియజేయి. యోగాలు, యాగాలు, జ్ఞానమార్గాలు, విజ్ఞాన విదాయక సాంఖ్యాది యోగాలు, శాస్త్రాలు వీటిని గురించి తెలియజేయి. నాస్తికుల గురించి చెప్పు. అశాస్త్రీయ వివాహంవల్ల పుట్టేవారిని ఎలా విభజించాలో సూచించు. వారి గుణాలు, మాటలు, పనులు ఎలా ఉంటాయో చెప్పు. రాజనీతి గురించి, దండనీతి గురించి వివరంగా తెలియజెయ్యి. పితృయజ్ఞాలు, పితృతర్పణాలు, తపస్సులు వీటన్నిటిగురించి వివరంగా తెలియజేయి. ఆపద్ధర్మాలేమిటి? ఏమిచేస్తే విష్ణువు సంతోషిస్తాడో? గురువు ఋణాన్ని తీర్చుకోవడమెలా? ప్రళయం ఎన్ని రకాలు? గోవిందుడి స్వరూపం ఎలాంటిది? జీవబ్రహ్మైక్యం ఎలా సిద్ధిస్తుంది.

విదురుడు విజ్ఞానసంపన్నుడు, ధృతరాష్ట్రాదులకు జ్ఞానాన్ని బోధించినవాడు. తన జ్ఞానంద్వారా, ధర్మప్రీతిద్వారా, వ్యక్తిత్వం ద్వారా శ్రీకృష్ణుడి దయకు పాత్రుడైనవాడు. అటువంటి మహనీయుడు కూడా అజ్ఞానిలా మైత్రేయమహర్షిముందు తన జ్ఞానదాహాన్ని వెల్లడించుకున్నాడు. ఇది ఆయన అణుకువను సూచిస్తూ ఉంది. ఇంకా ఇంకా తెలుసుకోవాలనే ఆరాటాన్ని అభివ్యక్తం చేస్తూ ఉంది. ప్రపంచంలో

అన్నిటికంటే అత్యంత శ్రేష్ఠమైంది జ్ఞానమే. అది ఇచ్చే ఆనందం మరెక్కడా లభించేది కాదు. అందువల్ల ప్రతివారూ విజ్ఞాన సముపార్జన ద్వారా వికాసం పొందాలని ఈ అంశం బోధపరుస్తూ వుంది.

ప్రాణుల దేహాలూ, బుద్ధులు, ఆత్మలు అన్నీ భగవంతుడే అనడం వల్ల జీవులస్వతంత్రులని స్పష్టమవుతుంది. ద్వేషాభినందనలకు పాత్రులు కారని బోధపడుతుంది. మైత్రేయుడు చెప్పినదాన్ని బట్టి మన అవయవాలన్నీ చక్కగా పనిచేసేందుకు నిర్దిష్ట ప్రయోజనాలను సిద్ధింవజేసేందుకు కారణం దేవతలని తెలుస్తూ ఉంది. కృతజ్ఞతాపూర్వకంగా వారిని సేవించడం మన కర్తవ్యమని అవగతమవుతూ ఉంది. విష్ణుభక్తులు బ్రహ్మకన్నా, శివుడికన్నా కూడా ఉన్నత స్థానాన్ని పొందగలరనడం వల్ల విష్ణుభక్తి ఎంతశక్తిమంతమైందో తెలుస్తుంది. అనన్యభక్తిని అలవరచుకొని విష్ణువును సేవించవలసిన ఆవశ్యకత ఇక్కడ విదితమౌతుంది."

భాగవత విజ్ఞానం

శుకమహర్షి ఒక క్షణం ఆగి మళ్ళీచెప్పడం కొనసాగించాడు.

వినయాభరణుడైన విదురుడి మాటలు మైత్రేయుడి వీనులకు విందుచేశాయి. ఆనందంతో అతని అంతరంగం పరవశించింది. అమృతాన్ని తలపించే మాటలు ఆయన నోటి నుండి వెలువడ్డాయి.

"విదురా! సంకర్షణుడు భాగవతాన్ని ఒకప్పుడు పాతాళ లోకంలోకి తీసుకెళ్ళాడు. అక్కడ ఒక ప్రదేశంలో ఆత్మధ్యానతత్పరుడై కొంతసేపు కళ్ళుమూసుకున్నాడు. సనకసనందనాదుల అభ్యుదయం గురించి ఆలోచిస్తూ కళ్ళుతెరిచాడు. సనకాదులాస్వామిని సన్నుతించారు. సనకసనందనాదుల సన్నుతికి ప్రసన్నుడైన సర్వేశ్వరుడు సనత్కుమారుడికి భాగవతాన్ని ఉపదేశించాడు. సనత్కుమారుడు సాంఖ్యాయనుడికి ఆ భాగవతాన్ని ప్రబోధించాడు. సాంఖ్యాయనుడు పరాశరుడికి చెప్పాడు. పరాశరుడు బృహస్పతికి తెలియజేశాడు. బృహస్పతి ఏకాంతంగా నాకు ఉపదేశించాడు. ఆ భాగవతాన్ని నీకిప్పుడు వివరంగా చెబుతాను ఆకర్ణించి ఆనందించు. (సశేషం)

పరశురామావతార దీప్తి

- ఆర్. శోభాదేవి

గాదిరాజు కుమార్తె సత్యవతి. ఋచికుడు చెవులు మాత్రం నల్లగావున్న వేయి తెల్లని గుర్రాలను శుల్కంగా యిచ్చి సత్యవతిని వివాహ మాడాడు. భార్య సత్యవతి, ఆమె తల్లి కూడా పుత్రులు కావాలని కోరగా ఋచీకుడు బ్రహ్మ మంత్రాలతో ఒక హవిస్సును, క్షత్రియ మంత్రాలతో మరో హవిస్సును సిద్ధం చేశాడు. ఋచీకుడు స్నానానికి వెళ్ళివచ్చేలోగా సత్యవతి తల్లికి ఒకటి యిచ్చి తాను మరొకటి స్వీకరించింది. ఋచీకుడు వచ్చి గమనించాడు. హవిస్సులు తారుమారుగా స్వీకరించినందువల్ల నీ తల్లికి బ్రహ్మజ్ఞాని అయిన పుత్రుడు నీకు రాజస తామస గుణములు గల కుమారుడు జన్మించ గలరని హెచ్చరించాడు. సత్యవతి ఆవేదనతో ప్రార్థించగా - కుమారుడు సాధువుగాను, మనుమడు క్రూరుడు అగునట్లు అనుగ్రహించాడు. ఆ విధంగా తల్లికి బ్రహ్మజ్ఞాని విశ్వామిత్రుడు, సత్యవతికి జమదగ్ని జన్మించారు. సత్యవతి కౌశిక నదిగా మారి ప్రవహించింది. జమదగ్ని రేణుకను వివాహమాడి పుత్రులను పొందాడు. శ్రీహరి అంశతో పరశు రాముడు పుత్రుడుగా జన్మించి క్షత్రియులను హతమార్చాడు.

కార్తవీర్యార్జునుడు వేటకై వెళ్ళి అలసిపోయి దైవ వశంగా జమదగ్ని ఆశ్రమానికి వెళ్ళాడు. ముని ధేనువు సాయంతో రాజుకు, పరివారానికి ఆతిధ్యమిచ్చాడు. రాజుకు ధేనువుపై మనసు పడింది. అడిగితే ముని ఇవ్వలేదని బలవంతంగా తీసుకొని వెళ్ళాడు. ఈ విషయం తెలిసిన పరశురాముడు గండ్ర గొడ్డలితో వెళ్ళి సైన్యాన్ని రాజును సంహరించి దూడతో సహా ధేనువును తీసుకొని వచ్చాడు. అప్పుడు జమదగ్ని క్షమయే మనకు అలంకారం. సర్వేశ్వరుడు మనలను బ్రహ్మ పథంలో నిలిపాడు. క్రోధం పనికిరాదు అని పలికాడు.

ఒకనాడు రేణుకా దేవి నీళ్ళు తేవటానికి గంగానదికి వెళ్ళింది. స్త్రీలతో స్నానం చేస్తున్న గంధర్వుడైన చిత్రరథుణ్ణి చూచి మైమరచి అలాగే నిలిచిపోయింది. జమదగ్ని దివ్యదృష్టితో ఆలశ్యానికి కారణం తెలుసుకొని తల్లిని చంపమని కుమారులను కోరాడు. చివరివాడైన పరశురాముడు తండ్రి ఆజ్ఞను పాలించి తల్లినీ, నిరాకరించిన సోదరులను చంపాడు. అతనిని మెచ్చి తండ్రి వరాలు కోరుకొమ్మనగా తల్లినీ సోదరులను బ్రతికించమన్నాడు. అట్లే జమదగ్ని వారిని బ్రతికించాడు.

పరశురాముడు సోదరులతో కలసి సమిధలకు అడవికి వెళ్ళిన సమయంలో రాజకుమారులు వచ్చి ధ్యానంలో వున్న జమదగ్ని తల నరికి వెళ్ళారు. రామా! రామా! అని తల్లి 21 మారులు గుండెలు బాదుకుంటూ భర్తపైబడి రోదించింది. గండ్ర గొడ్డలి ధరించిన పరశు రాముడు కార్తవీర్యార్జునుని కుమారులనే గాక, 21 మారులు క్షత్రియులను వెదకివెదకి సంహరించాడు. శత్రురక్తంతో కురుక్షేత్రంలో పంచహ్రదాలు ఏర్పడ్డాయి. వానినే శమంతక పంచకం అంటారు పరశురాముడు తండ్రి శిరస్సు తెచ్చి యజ్ఞం ద్వారా ఆత్మ స్వరూపుడైన భగవానుని ఆరాధించాడు. భూ భాగాన్ని అంతా దానంచేసి సరస్వతీ నదియందు అవభృత స్నానం చేసి పవిత్రుడై వెలుగొందాడు. సర్వశక్తి మంతుడైన శ్రీహరియే భృగువంశంలో పరశురామునిగా అవతరించి దుష్టులైన క్షత్రియ సంహారం చేశాడు.

ఆధ్యాత్మిక భావం :

జమదగ్ని పరమాత్మ నెరిగిన జీవుడు. జమదగ్ని వద్ద పరమాత్మానందం రేణురూప పరమాణువుగా వుంటుంది. కనుకనే జమదగ్నితో భార్య రేణుక వున్నదని చెప్పబడింది. జీవునిగా వున్న పురుషుడే పరమాత్మ.

కార్త వీర్యార్జునుడు సుప్రతిష్ఠితమైన శక్తి గల జీవుడు. అర్జునుడు అనే శబ్దం ఋజువర్తనను తెలియజేస్తుంది. వాసనాబలం కలవాడు కార్తవీర్యార్జునుడు. ఇతనికి సహస్ర బాహువులు వున్నాయి. అంటే జయాపజయాలు లాభనష్టాలు, రాగద్వేషాలు, సుఖ దుఃఖాలు మొదలైన ద్వందాలు సహస్రంగా వున్నాయి. ఈ ద్వంద్వ భావాలు శరీరంలోనే వున్నాయి.

పరమాత్మను చేరుకోవాలనే కోరికగల జమదగ్ని దగ్గర కామధేనువు వున్నది. ద్వంద్వ యుతుడైన కార్త వీర్యుడు కామధేనువును బలవంతంగా గ్రహించాడు. ఆ పరశురామ రూపం ద్వంద్వ భావనా యుతమైన కార్తవీర్యార్జునుని రూపాన్ని నశింపజేసి పరమాత్మ కాంక్ష కలిగిన జమదగ్నికి కామధేనువును అందించింది.

రేణుక ప్రకృతి. పరమాత్మానుభూతిని లౌకిక ప్రకృతి నాశనం చేస్తుంది. ఐతే ఈ రేణుకా ప్రకృతి తామసికం కాదు. సాత్విక ప్రకృతి. పొరబాటుగా ఎప్పుడైనా ఐహికానందాసక్తి కలిగినా తిరిగి మరల పరమాత్మా నందానుభూతిని కోరుకుంటుంది. రేణుకాదేవి బ్రతకటం ఆ విషయం నిరూపించటానికే!

కార్తవీర్యుని కుమారులు జమదగ్నిని చంపారనే కోపంతో రాజవంశాలను ముయ్యేడు మారులు (3 7) పరశురాముడు నాశనం చేశాడు. ప్రతి సాధకునిలోనూ సప్త ధాతువులుంటాయి. అవి - చీము, నెత్తురు మాంసము, క్రొవ్వు, ఎముక, మూలుగు, శుక్రము అనేవి. ఈ సప్తధాతువులు శరీరాన్ని నిలిపి వుంటాయి. వీటికి సత్వగుణము, రజోగుణము, తమోగుణములతో సంబంధం వుంటుంది. ప్రతి ఒక్కరిలో ఇవి కొంత ఎక్కువ తక్కువలుగా వుంటాయి. త్రిగుణ రహితంగా గాని, ఈ ఏడు ధాతువులరహితంగాగాని ఎవరూ వుండరు. ముక్తి కావాలంటే ఈ ఇరువదియొక్క ధాతువులను నశింప జేయాలి. ఈ ఆధ్యాత్మిక యోగజ్ఞానమును వంటబట్టించుకున్న వాడు ముక్తిని పొందుతాడు అనేది సత్యం.

వార్తలు

(1). 30-08-2021వ తేది సోమవారం ఆశ్రమంలో శ్రీకృష్ణాష్టమి సందర్భంగా శ్రీకృష్ణపరమాత్మకు షోడశోపచారాలతో విశేష పూజ జరిగినది. ప్రసాదవినియోగం, భక్తులకు అన్నదానం చేయబడినది.

తిరుపతి శ్రీమలయాళ సద్గురు సేవాసమాజంలో నేడు రాత్రి శ్రీకృష్ణాష్టమి వేడుకలు జరిగినవి.

(2) 10-09-2021తేది శుక్రవారం నాడు వినాయకచవితి సందర్భంగా వినాయకునికి షోడశోపచార పూజ జరిగినది. ప్రసాదవినియోగం చేయబడినది.

(3) 05-09-2021 తేది ఆదివారం మాస శివరాత్రి సందర్భంగా శ్రీశుకబ్రహ్మాశ్రమంలో ప్రదోషకాలంలో శ్రీనర్మదేశ్వర మహాదేవునకు రుద్రాభిషేకం, బిల్వార్చన జరిగినది.

(4) 20-09-2021 తేది సోమవారంనాడు పూర్ణిమ సందర్భంగా ఆశ్రమంలో గురుపాదుకాపూజ జరిగినది.

(5) ఆశ్రమ కంటిఆసుపత్రిలో ఆగష్టు నెలలో ఓ.పి.విభాగంలో 528 మందికి కంటి పరీక్షలు చేసి తగు చికిత్సలు చేయబడినవి. 52 మందికి కంటి పొరలు తీసి కళ్ళలో లెన్సు అమర్చబడినవి.

---

(6) ఆశ్రమ సద్గురు సేవాట్రస్టు నిధికి ఈక్రింది వారు విరాళం పంపినారు -

1. గంగాప్రకాశ్ (వర్నీ-తెలంగాణా) రూ.20000/-
2. దువ్వూరు శాంతమ్మ (రామన్నపాలెం) రూ.20000/-
3. అత్యం వెంకటాచలం (పెనుగొండ, ప.గో.జిల్లా) రూ. 20999/-
4. డా॥ ఎ.తారాలక్ష్మి (ఇంగ్లీషు లెక్చరర్, నాయుడుపేట)రూ.25000/-

పూజ్యశ్రీ విద్యాప్రకాశానందగిరిస్వాములవారి
రచనలు చదవండి, చదివించండి.

		రూ.
1.	గీతామకరందము (తెలుగు)	350.00
2.	గీతామకరందము (ఇంగ్లీషు)	400.00
3.	యోగవాసిష్ఠ రత్నాకరము	300.00
4.	రామాయణ రత్నాకరము	300.00
5.	భాగవతరత్నాకరము	300.00
6.	భారతరత్నాకరము	300.00
7.	ఉపనిషద్రత్నాకరము	150.00
8.	మోక్షసాధనరహస్యము	100.00
9.	The Secret of Liberation	200.00
10.	Lecturers on Geetha	200.00
11.	గీతోపన్యాసములు	120.00
12.	బ్రహ్మచర్యవిజయము	60.00
13.	బ్రహ్మానంద వైభవము	30.00
14.	ఆత్మానుసంధానము	50.00
15.	అమృతబిందువులు	50.00
16.	స్థూలాక్షరి తాత్పర్యగీత	70.00
17.	పరమార్థ కథలు	120.00
18.	స్వాములవారి జీవిత చరిత్ర	100.00
19.	ఉపనిషత్ కథలు	40.00

గ్రంథములు కావలసినవారు పైకనిన ప్రకారము వీటి ధరలను ఎం.ఓ. ద్వారాగానీ, చెక్కు ద్వారా గాని, శ్రీ శుకబ్రహ్మాశ్రమము, శ్రీశుకబ్రహ్మాశ్రమము పోస్టు, శ్రీకాళహస్తి - 517 640 అను చిరునామాకు పంపగలరు. పోస్టేజి అదనము.

Regd.No. TRP / 123 / 2021 - 23 October 2021 Rs.10/- R.No.8139/63

Date of Publication 26-09-2021, Permitted to post : 29th, 30th every month.

సత్యం ఒక మహా వృక్షం. దానిని మనం ఎంతగా పోషిస్తే అంతగా ఫలాలను ఇస్తుంది.

సత్యం దైవ స్వరూపం. మనసా వాచా కర్మణా త్రికరణ శుద్ధిగా సత్య సంధతను పాటించడమే సత్యము.

ఎక్కడ సత్యము ఉంటుందో అక్కడే అసలైన విజ్ఞానం ఉంటుంది. ఆనందం నెలకొని ఉంటుంది.

హింస ద్వారా సత్యాన్ని తెలుసుకోలేము. అహింసతో సాధించలేనిది అంటూ ఏదీ లేదు.

సత్యమే దైవం. సత్యవ్రతం త్రికరణ శుద్ధిగా ఆచరించాలి.

నోటిని, కళ్ళను, చెవులనూ అతిజాగ్రత్తగా వినియోగించుకోండి. అపద్దం చెప్పవద్దు. ఎవరినీ నిందించవద్దు. నీ కళ్ళలో చెడును చూడవద్దు. ఎవరిని గురించి చెడు ఫిర్యాదును వినవద్దు.

— మహాత్మా గాంధీ

ఈ పేజీ స్థల దాతలు

సుభద్రా చారిటబుల్ ట్రస్టు

హైదరాబాద్, తెలంగాణ రాష్ట్రం